
మలయ మారుతం
కడిమిళ్ళ రమేష్

మాతామహ దంపతులు



శ్రీ వఝుల కృష్ణశాస్త్రి - శ్రీమతి కృష్ణవేణి

మలయ మారుతము

ఖండ కావ్యము

కడిమిళ్ళ రమేష్ ఎమ్.సి.ఎ.

ప్రతులు :1000

ప్రచురణ కాలము..2010

వెల.. 40/- రూ.లు

ప్రతులకు

కడిమిళ్ళ రమేష్

3.6.50, యల్లమిల్లివారి వీధి

నరసాపురం - 534275, ప. గో. జిల్లా

సెల్ : 9290128346, 9247879606

కవర్ డిజైన్ మరియు ముద్రణ

క్రియేటివ్ మల్టీకలర్ ఆఫ్‌సెట్

స్టేట్ బ్యాంక్ ఎదురుగా, స్టీమర్ రోడ్

నరసాపురం-534275, ప.గో.జిల్లా

సెల్. 9866115113

నన్నుగురించి

మా ఊరు నరసాపురం. నిజమైన ప్రేమకు ఆకరం. ఎక్కడో నాసిక్‌లో జన్మించి, ఉరుకులు పరుగులు వేసికొంటూ, ఆనకట్టల అడ్డుకట్టలను త్రోసివేస్తూ, పచ్చని బయళ్ళను సస్యశ్యామలం చేస్తూ కడకు ప్రియుని ఒడిలో చేరే గోదావరీ సముద్ర సంగమ స్థానం. నిత్య కల్యాణ ధామం. కాదు కాదు అదొక జీవ పరమాత్మైక్య భావాన్ని ఉద్బోధించే పవిత్ర ప్రదేశం. పరమాత్మనుండి జీవాత్మ విడివడినట్లు అవధి లేని సముద్రమునుండి విడివడి, మేఘాల రూపంలో ఇచ్ఛారూపంగా గాలివాటుకు సంచరిస్తూ చివరకు చినుకు రూపంలో ఇలపై పడి తిరిగి నదుల రూపంలో కడలిని చేరి తన అస్తిత్వాన్ని నిలుపుకొను అద్వైతామృతాన్ని వర్షించే మధుర ప్రదేశం. సంస్కృత ఆంధ్ర ఆంగ్ల జాతీయ భాషలలో, సంగీత సాహిత్య నృత్యాది లలిత కళలలోను, సాంఘిక రాజకీయ చైతన్యంలోను ఎంతోమంది దేశికోత్తములకు నెలవు మా ఊరు.

ఇక నేను చదువుకొన్నది టేలరున్నత పాఠశాలలో. సుమారు 150 ఏళ్ళ పైబడిన చరిత్రతో, అనుపమ పాండితీ వైభవంతో అలరారు ఉపాధ్యాయ బృందంతో, విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు, విజ్ఞాన శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావు వంటివారిని విద్యార్థి దశలోనే జాతి రత్నాలుగా సానబట్టి తీర్చిదిద్దిన ఘనత కలిగిన పాఠశాల.

శ్రావణ సంధ్యా సమీరాలలో, చిరు జల్లుల ముంగిటిలో బాలబాలికల సందడిలో సాగిన నా బాల్యం అందునా విద్యాభ్యాసం ఒక మధుర రసమయ కావ్యం. చిరస్మరణీయం.

మా తల్లిదండ్రులిరువురు అదే పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేయుచుండుట, నేను వారిరువురికి విద్యార్థినగుట విశేషమగు విషయంగా భావిస్తాను. అలుపెరుగక అంకిత భావంతో విద్యాబోధన చేసే గురువుగా మా తల్లి మీనాక్షి విద్యార్థుల హృదయ ఫలకాలపై శాశ్వతమైన స్థానాన్ని సంపాదించుకొన్నదనుట అక్షర సత్యం. ఇక మా తండ్రిగారి విషయానికి వస్తే, ఆయన కేవలం తెలుగు పాఠాలు చెప్పే తెలుగు పండితులు మాత్రమే కాక తెలుగుభాషకు మాత్రమే పరిమితమైన పద్య కవిత్వంలో లబ్ధ ప్రతిష్ఠులైన కవిగా, అవధాన రంగంలో సహస్రావధానిగా, విశేషించి తన శిష్యులను అష్టావధానులుగా, శతావధానులుగా, సహస్రావధానులుగా తీర్చిదిద్దిన గురు సహస్రావధానిగా, మరెందరినో పద్యకవులను తీర్చి దిద్దిన కవిగురువుగా, తన శిష్యులను తనయంతవారినిగాను, తనను మించినవారినిగాను తయారు చేసిన నిష్కల్మష గురువుగా లోకుల ప్రశంసకు పాత్రమైన వ్యక్తి డా!!కడిమిళ్ళ వరప్రసాద్. అటువంటి మాతాపితలకు పుత్రునిగా జన్మించుట నా పూర్వజన్మ సుకృతం.

ఇక తమ్ముడు శ్రీ విరించి కూడ అదే పాఠశాలలో వారి వద్దనే చదివుకోవటం భాషాప్రవీణలో చేరటం కవితాసక్తిని పెంచుకోవటం విద్యార్థి దశలోనే శ్రీ విరించి అనే మకుటంతో శతకమొక్కటి వ్రాయటం అదొక అవ్యక్త మధురం.

మా ఇంటికి మా నాన్నగారు పెట్టిన పేరు హంసవాహన. నా కనులకు అదొక అందమైన ఉద్యానవనం. అది పూలమొక్కలకే కాదు పండ్లతోటలకు కూడ నెలవు. మా ఇంట అడుగు మోపిన వెంటనే రకరకాల జ్ఞాపికలు వందల సంఖ్యలో వసంతకాల సుమనోహర కుసుమ గుచ్ఛాలుగా కనువిందు చేస్తుంటాయి. ఇక పండ్ల విషయానికి

వస్తే సంస్కృతాంధ్ర భాషలలో గల పద్య గద్య కావ్యాలన్నీ నవరస మధుర ఫలనికరములుగా కనబడతాయి. అందులో నేనొక ఊహ తెలియని బాలునిలా, బాల్య చాపల్యంతో ప్రతి పద్యకావ్య ఫలాన్ని వడివడిగా ఆరగించేందుకు నోట బెట్టుకొంటుంటాను.

పద్యరచన నాకు చిన్నతనంలోనే కొద్దిగా అలవడింది. చిన్న చిన్న వృత్తాలలో చిన్నచిన్న భావాలతో ఏవేవో పద్యాలు వ్రాస్తూండేవాడిని. ఒకసారి మా పాఠశాలలో జరిగిన పద్య అంత్యాక్షరి పోటీలలో నేను వ్రాసిన పద్యాన్నే నా స్నేహితురాలు చదవడం, అది విని నేనాశ్చర్యపోవడం, ఇప్పటికీ మరపురాని తియ్యని జ్ఞాపకం. ఆ వయసులోనే మా పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలైన శ్రీమతి కృష్ణవేణిగారిపై నేనొక పద్యాన్ని వ్రాయడం, దానికి మెచ్చుకొని మంచి కవివి అవుతావని నన్ను ఆమె ఆశీర్వదించడం జరిగింది. జీవితంలో నన్ను ప్రభావితం చేసినవారు తల్లిదండ్రులు, గురువులు, మిత్రులు మరియు పుస్తకములు మాత్రమే. ఈ లోకంలో నేను చూచిన అన్ని బంధాలకంటె గురుశిష్య సంబంధం అత్యుత్తమమని నా నిశ్చితాభిప్రాయం.

అందుకు కారణం లేకపోలేదు. తల్లిదండ్రులిద్దరూ నాకు గురువులు కావడం, ఇంకా మిగిలిన గురువులు నాపై చూపిన ఆదరాభిమానాలు, కొన్ని సందర్భాలలో నా స్నేహితులుకూడ గురువులులాగ నాకు ఎన్నో విషయాలను చెపుతూండడం. ఇట్టివి ఎన్నో మరపు రాని సంఘటనలు.

నేను ఎమ్.సి.ఎ చదువుతూ సెలవులలో ఇంటికి వచ్చినపుడల్లా మా మాతామహులు సంస్కృత పండితులు కృష్ణశాస్త్రిగారి వద్ద వివేకచూడామణి వంటి వేదాంత గ్రంథాలు, నాన్నగారివద్ద సంస్కృత

ఆంధ్ర పద్యకావ్యాలు మరియు తర్క వ్యాకరణ శాస్త్రాలు కొద్దికొద్దిగా చదవడంతోబాటు, మాఇంటి ప్రక్కనే ఉన్న రిటైర్డ్ జిల్లా జడ్జి డా॥ సి.జాకబ్ గారివద్ద ఆంగ్ల భాషా కావ్యాలు మరియు వెస్టర్న్ ఫిలాసఫీ చదువుతూండేవాడిని. ఆ యీ పరిస్థితులే మీముందొక చిన్నపాటి కవిగా నన్ను నేను ఆవిష్కరించుకొనేందుకు దోహదపడ్డాయి.

పాఠక హంసలారా! క్షీర నీర న్యాయంగా నా కవిత్వంలోని గుణాలను ఆస్వాదించి, లోపాలను మన్నించి, నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాను. అభ్యర్థిస్తున్నాను

సెలవు

నరసాపురం   మీ,

2010   కడిమిళ్ళ రమేష్. ఎమ్.సి.ఏ.

అడనో యీడనో కవనమందున నాదు కవిత్వబాల ప
ల్కాడిన రీతి గాంచి, యపహాస్యము సేయకుడయ్య మ్రొక్కెదన్
జూడ వయస్సురాని పసి సోయగమయ్యు రసజ్ఞు జూచి, తా
ప్రౌఢయనా నొయారములుపోవుట సాజముగాదె యెంతయున్!!

కృతజ్ఞుడను

కృతిని స్వీకరించిన

మాతామహులు : శ్రీ వఝుల కృష్ణశాస్త్రి, నరసాపురం

ఈ కృతికి ఆకృతిని కల్పించేందుకు ప్రోత్సహించిన

బాబాయి : శ్రీ భాస్కర శ్రీనివాసమూర్తి. భాగ్యనగరం

వాత్సల్యంతో ఆశీస్సులందించిన...

మా తలిదండ్రుల గురుదేవులు :

ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ.
తిరుపతి

శ్రీ కె. కోటారావు. అనకాపల్లి

మా తండ్రిగారి హితులు : డా!! కేశాప్రగడ సత్యనారాయణ.
రాజమహేంద్రవరం

మా తండ్రిగారి ప్రాణమిత్రులు : డా!! అబ్బిరెడ్డి పేరయ్యనాయుడు
రాజమహేంద్రవరం

మరియు క్రియేటివ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, నర్సాపురం

ఇంకా ఎందరో హితులు, సన్నిహితులు, ఆప్తులు, ఆశీఃప్రదాతలు వెన్ను తట్టి, చేయిపట్టి మునుముందుకు నడిపించిన స్ఫూర్తి ప్రదాతలు అందరికీ ఆజన్మాంతం కృతజ్ఞుడను.

మన్యేహం ధన్యమాత్మానమ్

మీ **కడిమిళ్ళ రమేష్** ఎమ్.సి.ఎ

నరసాపురం

27.02.2010.

పిట్ట కొంచెం కూత ఘనం

రాష్ట్రపతి పురస్కార గ్రహీత
ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ
రాష్ట్రియసంస్కృతవిద్యాపీఠం, తిరుపతి

సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్?
పద్యవిద్య హస్తవశమైన చాలదే
రంభయేల? కవికి రాజ్యమేల?
భావరాజ్యమున్న స్వారాజ్యమేపాటి?...

అనికదా! కవిసూక్తి. కాళిదాసంతటివాడు తనను 'కవియశఃప్రార్థీ' అన్నాడు. కవి అనిపించుకోవాలనే తహతహ తనకుందన్నాడు. తనకు వాల్మీకి పట్ల ఉన్న గురుభావాన్నీ, వాల్మీకికి ఉన్న జగత్పూజ్యత్వాన్నీ చెప్పడానికి వాల్మీకిని ఋషి అనో, మహర్షి అనో అనలేదు. 'తామభ్యగచ్ఛద్రుదితానుసారీ కవిః కుశేధ్మాహరణాయ యాతః' అని, 'కవి' అన్నాడు. ఇంతెందుకు పరమేశ్వరుడున్నాడు. ఆయనకు ఒకపేరుండాలికదా మనకోసం. ఆ పేరు ఎవరు పెడతారు? తల్లిదండ్రులుంటే వాళ్ళేదో పేరు పెడతారు. ఆయనకా భాగ్యం లేదుకదా! తనకు తానే పేరు పెట్టుకోవాలి. పేరు సెలక్టు చేసికోవాలి. అదో పెద్దయజ్ఞం. అంతా చేసి తనకో పేరు పెట్టుకొని మురిసిపోయాడు. ఆ పేరేమిటి? నైయాయికః అనా! కాదు. వైయాకరణః అనా! కాదు. మరేమిటి? 'కవిః' అని. అంత క్రేజ్ కవిపదమంటే. మహామహులెందరో కవియశస్సుకోసం తపనపడిపోయారు. సరే! కవులెందరో ఉన్నారు. వాళ్ళు కవిపుత్రులూ కాదు, కవిపుత్రకులూ కాదు. తాము కవిపుత్రకులం కావాలి అని కవులు కానివారు కోరుకోకపోయినా, కవులు కోరుకొనే

తీరుతారు. అయినా ఆ అదృష్టం నన్నయాదులకు గాని, శ్రీనాథాదులకు గాని పట్టిన జాడలేదు. వారి తండ్రులుకాని, కొడుకులు గాని కవులైనట్లు కనబడదు. కవితా సరస్వతికి తమవంశంలో తామే శ్రీగురుభ్యో నమః హరిఃఓమ్, తామే హరిఃఓమ్ తత్సత్ అయినట్లే కదా! దీనికపవాదం ఒకటో రెండో కన్పడితే వాటిలో ఒకటి కడిమిళ్ళ వరప్రసాద్. తాను కవియై, తన తండ్రిని కవిపుత్రకుణ్ణి చేసాడు. తనపుత్రులు కవులై తాను కవిపుత్రకుడు అయ్యాడు.

తాతకు లేదు కవిత్వము
నా తండ్రికి కూడ లేదు నాకే యబ్బెన్
నాతోడనె యాగదులే
నా తనయులకిప్పుడిపుడె నాటుచునుండెన్!!

అని ఏనాడో వరప్రసాద్ చెప్పుకొన్న విషయం అక్షర సత్యంగా నిలిచింది. ఇంతేనా! వరప్రసాద్ ఎంతమందిని కవులుగా, కవయిత్రులుగా, అవధానులుగా మలిచాడు. ఎంతమందినో అష్ట శత సహస్రావధానులుగా మలచిన శిల్పికదూ అతను. ఈ యశస్సు మరొకరికికూడా దక్కేస్తుందేమో అనుకోలేదు. దక్కితీరాలనుకొన్నాడు. దక్కించాడు. వరప్రసాదు వ్యక్తిత్వంలో ఇదొక మణిమకుటం. అందుకే అతడు మాత్రమే గురుసహస్రావధాని కాగలిగాడు. ఈ అనసూయా తపస్సుకి ఫలం అతని ఇద్దరు అబ్బాయిలూ కవులు, అందునా పద్యకవులు కావడం. కేవలం ఈ జన్మలోని యీ తపస్సే దానికి కారణం అనుకున్నా సరిపోదు. ఎందుకంటే, తంతువాయుడొకడు (నేతపనివాడు) నిరక్షరాస్యుడై కూడ భోజుని వదనారవిందం చూసేసరికి కవితా శారదానుగృహీతుడై

కావ్యం కరోమి నహి చారుతరం కరోమి
యత్నాత్ కరోమి యది చారుతరం కరోమి
భూపాల మౌళిమణి రంజిత పాదపీఠ!
హేసాహసాంక! కవయామి, వయామి, యామి!! అనలేదూ!

అంతమాత్రంచేత భోజుని కొడుకులెవరూ కవులైనట్లు లేదు. కింకవీంద్రఘటా పంచాననులు (తిరుపతి వేంకట కవులు) ఎందర్నో కవులుగా అవధానులుగా అనుగ్రహించలేదూ! వారి పుత్రులెవరూ పెద్ద కవులైనట్లు లేదు. ఏతావతా తేలిందేమిటంటే కేవలం ఈ జన్మ తపస్సే కాదు. దానికి జన్మాంతర సుకృతం జతపడితేనే కవులు కవిపుత్రకులయ్యేది. వరప్రసాదును గురించి లోకంలో ఒక మాట

ఉంది. 'కడిమిళ్ళ గాలి తగిలితే కవిత్వం వస్తుంది' అని. అది ఇంట, బయటకూడ యథార్థమయింది. ఇద్దరు పిల్లలు రమేష్, శ్రీవిరించి కూడ కవులయ్యారు. చిన్నవాడు శ్రీవిరించి ముందే శ్రీవిరించిశతకం వ్రాసి దానికి రాష్ట్రస్థాయి యువకవి అవార్డును కూడా అందుకున్నాడు. ఇప్పుడు పెద్దవాడు రమేష్ ఇదుగో ఈ మలయమారుత కృతిని అందిస్తున్నాడు.

చి!!రమేష్ కవిత్వం ప్రావృట్కాలపు వాగు కాదు. జీవనది. ఈ కదంబానిలానికి ఇతడు పెట్టిన పేరు మలయమారుతం. పద్యాలన్నీ దాదాపు ముక్తకాలు. ఓ ముక్తకం పేరు మలయమారుతం.

'కవితామతల్లికా కలకంఠ మృదురవం బతులిత మలయ మారుతము నాకు'... అంటూ సాగిన ఈ సీసం 'అమరజీవుల నిరుపమ త్యాగగాథ అతులితంబైన మలయమారుతము నాకు'... అనే తేటగీతి అంతిమ పాదద్వయంతో ముగుస్తుంది. దీనికి మిగిలిన పద్యాలతో ఏ సంబంధం లేకపోయినా దీనిపై మక్కువతో 'మల్లగ్రామ'న్యాయంగా వున్నకానికంతకూ మలయమారుతం అని పేరు పెట్టినట్లు కన్పడుతుంది. అయినా ప్రతిపద్యంలోను ఆ స్పర్శ అనుభవంలోకి వస్తుంది.

ఎక్కడా పదాలకోసం, భావాలకోసం, గణాలకోసం, యతిప్రాసలకోసం ఖేదపడకుండా గలగలా సాగిన కవిత్వమిది.

వడివడి నిద్రలేచి, భగవంతునిపై యొక నిందవేసి, భ
క్తుడువలె బూజసేసి, సిరికోసము గాలము వేసివేసి, సా
గెడి నడకాగనీక పరుగే పనిగా బని చేసిచేసి యొ
త్తిడులకు బుజ్జివాచి, యిక దీయరె కున్కును రాత్రివేళలన్!! (ఒత్తిడి)

సర్వత్ర సంస్కారసౌరభాలు, ప్రత్యక్షమౌతాయి. వయసు చెప్పించిన కవిత్వం ఏ రెండుమూడు చోటుల్లోనో 'ప్రేయసి, ప్రేమలేఖ' ఇత్యాదుల్లో ఉన్నా అంతటా సంప్రదాయ నిబద్ధత. చక్కని కట్టుబాట్లతో పెరిగినందువల్ల కలిగే గాఢ సత్సంస్కారాలు ముచ్చటగా దర్శనమిస్తున్నాయి. ఏ పద్యమూ తాను ఒదిగించుకోలేని భావాన్ని నెత్తిన వేసుకున్నదీ లేదు. అయోమయం లేదు. మూలమూల పదాలు వెతుక్కుని వేసుకుని అబ్బో! ఇతడు పండితుడే అని అనిపించుకోవాలనే వెఱ్ఱితనం లేదు. ధారాశుద్ధి కల ప్రసన్న కవిత్వం. మంచికవిగా, మంచివ్యక్తిగా ఎదిగే లక్షణాలన్నీ ఈ కవిత్వంలో ఉన్నాయి. కడిమిళ్ళ ధన్యుడు.

చి. రమేష్‌కూడ తొందరలో అవధాని కావాలని ఆశిస్తున్నా. ఇతని లేఖినినుండి ఎన్నెన్నో కావ్యాలు వెలువడాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ ఈ సందర్భంగా చి.వరప్రసాదుని అభినందిస్తున్నాను.

ఇట్లు

రామసూర్యనారాయణ

తిరుపతి

23.02.2010

మలయమారుత సౌరభం

కె. కోటారావు

భాషాప్రవీణ, ఎమ్.ఎ తెలుగు,ఎమ్.ఎ. సంస్కృతం,

రిటైర్డ్ సెలక్షన్ గ్రేడ్ తెలుగు లెక్చరర్.

విశాఖ జిల్లా పద్యకవితా సదస్సు అధ్యక్షులు, అనకాపల్లి

మలయమారుతము ఖండకావ్య కర్త చి!! కడిమిళ్ళ రమేష్. కడిమిళ్ళ అనగానే లబ్ధప్రతిష్ఠుడు, కవివరేణ్యుడు, గురుసహస్రావధాని డా!! వరప్రసాద్ గుర్తుకు వస్తాడు. అతని ప్రథమ తనయుడే యీ రమేష్. ఈతని లేఖినీలతకు పూసిన తొలికుసుమం మలయమారుతం. <u>ఆద్యే వః కుసుమప్రసూతిసమయే</u> <u>యస్యా భవత్యుత్సవః</u>. ఆ ప్రథమపుష్ప ఆవిర్భావసమయంలో ఆనందంతో పండుగ చేసికొనేదట కాళిదాసు శకుంతల. మొదటి కావ్యోదయం కూడ అంత ఆనందాన్నందిస్తుందన్నమాట. ఈ మలయమారుతం సువాసనలు వెదజల్లుతూ ఉంటే కవికే కాదు, పాఠకలోకానికికూడ ఆనందమే కదా! మఱి, కొన్ని కవితల్ని మండూక ప్లుతంగా స్పృశిద్దాం.

<u>నన్నుగుఱించి</u> అనే శీర్షికలో తన ఊరు, బడి, గురువులు, తల్లిదండ్రులు, తమ్ముడు, ఇల్లు, తాతగారు, ఇంటిప్రక్క జడ్జీగారు... వీరందర్నీ కలుపుకుంటూ చెప్పిన మాటలు తనలోని ఒకకథా రచయితని పట్టి చూపిస్తాయి. పాఠకహంసలను తనవినయంతో కట్టిపడేస్తాయి. ఆమాటకొస్తే ఆ వినయం అతనొక్కడిదే కాదు, తండ్రితాతలనుండి వస్తున్నదే.

చిన్నతనంలో సైకిలుపై ఎక్కించుకొని ఊసులు చెబుతూ ఊరూవాడ తిప్పిన తాతగారినిగూర్చి

చిన్నతనమునందు నన్ను సైకిలుపైని
కొడుకు కొడుకటన్న కూర్మితోడ
ఊరువాడు త్రిప్పె నూసులన్ జెప్పుచున్
నన్ను గన్న తండ్రి కన్నతండ్రి!!

మేము చేసికొన్న మితపుణ్యమందునో
మమ్ము విడిచి మీరు మఱలి చనుట
మనుమడడుగుచుండె మనసార, యోతాత!
మఱల నొక్కమారు మఱలి రావె!! (పితామహుడు...2,3)

అని పితామహుణ్ని భువికి పిలవడం ఎవరికి జాలి కలిగించదు? చివరలో మన్నన సేయవె భారతీపతీ! అంటాడు. కవి నాన్నమ్మ పేరు భారతి. నాన్నమ్మ పేరుతో కలిపి పిలవడం వారిరువురి అన్యోన్య దాంపత్య స్ఫురణం ఎంత ఔచిత్యవంతం! నిన్నగాక మొన్న కన్ను తెరచిన చిన్నకవికి ఎన్నెన్ని భావాలో.

కన్నబిడ్డ కాలుజారి పడితే కళ్ళనీళ్ళు కార్చి, కడుపుకత్తుకొని తల్లడిల్లే తల్లి పాదాలు గుండెల్లో దాచుకొని ఆరాధించే సంస్కృతి మనది. కన్నతల్లి భువిని కల్పవల్లి అని మాతృదేవతను కొనియాడిన సంస్కారం కవిలో కనిపిస్తుంది.

<u>స్వగతము</u> 7వ పద్యంలో

తల్లి మీనాక్షిలోని వాత్సల్యగుణము
తండ్రి కడిమిళ్ళ యొసగు విద్యాధనమ్ము
తమ్ముడు విరించి ప్రేమయు దక్కియుండ
నాకు లోటన్నదేమిటి లోకమందు!!

అని సంతృప్తిని వ్యక్తం చేస్తాడు.

అంతేకాదు జన్మసాఫల్యానికి చక్కని భాష్యం 10వ పద్యం

జీవితంబున బరుల యాచింపకుండ
నొరులు ననుగాంచి జాలిని నొందకుండ
పయనమప్పుడు మంచంబు పట్టకుండ
బ్రతుక గల్గుట జన్మసాఫల్యమనెద!!

యౌవనదశలో నున్న కవికి ఎంత సాత్వికభావం.

మనకు స్వేచ్ఛను ప్రసాదించిన త్యాగధనుల నుద్దేశించి సామాన్యుల మాటల్లో <u>తెచ్చి చచ్చినవాడు ఒకడు, చచ్చి తెచ్చినవాడు ఒకడు</u> అని వింటూ ఉంటాం. ఇద్దరూ మహానుభావులే.ఒకడు మహాత్ముడు, ఇంకొకడు అమరజీవి.

ప్రాణములను విడిచి ప్రత్యేక రాష్ట్రంబు
దెచ్చిపెట్టినట్టి ధీరుడతడు
కనగ నాంధ్రికపర గాంధీమహాత్ముండు
తెలుగుతల్లి నుదుటి తిలకమతడు!! (అమరజీవి 9 ప.)

అమరజీవిని <u>తెలుగు తల్లి నుదుటి తిలకమతడు</u> అని కొనియాడిన వాక్యం చాల పదునైనది, పవిత్రమైనది కూడ. సరళశైలిలో నున్న గాంధీమహాత్ముడు, అమరజీవి పద్యాలు హైస్కూలు స్థాయి తెలుగు పాఠ్యభాగంలో చేర్చడానికి యోగ్యత కలవి.

మలయమారుతము సమతాగుణంతో, విషయ వైశిష్ట్యంతో సౌరభాలను వెదజల్లి, పాఠకుల హృదయాలను ఆహ్లాదపరుస్తూ, అన్వర్థ నామధేయకమైంది. కవిలో సామాజిక స్పృహ ఉంటే అది కవితా దర్పణంలో ప్రతిబింబిస్తుంది. కవి సమాజ శ్రేయోదృష్టితో ప్రజాసమస్యలను తడివి వర్గవైషమ్యాలను, ఆర్థిక అసమానతలను మూఢవిశ్వాసాలను అరగట్టి, సమసమాజ స్థాపనకై కృషి చేస్తూ జనాన్ని చైతన్యపరచడం కర్తవ్యంగా భావించాలి. <u>మూలుగు</u> శీర్షికలో కవి ఆర్థిక అసమానతని ఎంత చక్కగా వర్ణించాడో గమనించండి.

వేళకు తిండి లభింపక
మూలనుబడి పేదవాడు మూలుగుచుండన్
వేలుగ కోట్ల ధనంబులు
మూలనుబడి బ్యాంకులందు మూలుగుచుండెన్!!

(మూలుగు 1.ప)

తిండి లేక పేదవాడు మూలను బడి మూలుగుతుంటే, ఉన్నవాడి కోట్లాది రూపాయలు బ్యాంకు(స్విస్)ల్లో మూలనుబడి మూలుగుతున్నాయని దృష్టాంతంగా కళ్ళకు కట్టించడం కవి సామర్థ్యానికి తార్కాణం.

హితోక్తి 6వ పద్యంలో సహనం మనిషికి పెద్ద ఆభరణం. అది అన్నింటినీ సమకూరుస్తుంది. ధర్మరాజు కీర్తికి క్షమాగుణమే కదా మూలం అనిధర్మరాజును దృష్టాంతంగా చెప్పడం వల్ల ఎన్ని కష్టాలెదురైనా సహనగుణం కలవాడు చివరకు సత్ఫలితం పొందుతాడు అనే సత్యం పాఠకహృదయాన్ని పట్టుకొంటుంది.

మనసా! యనూన సహనము
మనుజునకును బెద్దతొడవు మఱవకుమదియే
యొనగూర్చును సకలమ్మును
మును ధర్మతనూజ కీర్తిమూలమ్మదియే!!

సెల్‌ఫోన్ ఈరోజుల్లో అందరికీ అవసరమైన వస్తువు. వేళకు ఆహారం విషయం కాదట, కంటికి నిద్ర ముఖ్యం కాదట. మఱి చేతిలో సెల్లే చాల ప్రధానమని కవి వర్ణించిన తీరు సహజ సుందరంగా ఉంది.

వేళకాహారంబు పెద్ద మేటరు కాదు
కంటికి నిద్ర ముఖ్యంబు కాదు
చేతిలో సెల్‌ఫోను చెవిలో యియరు ఫోను
చార్జింగు, సిగ్నలు చాలు దనకు
అమ్మ! యెట్లుండెనే యారోగ్యమనక యా-
ఫర్లకోసమ్మె ఎంక్వైరి చేయు
బైకుపై రోడ్డుపై బస్సులో పార్కులో
చెప్పంగ సర్వమ్ము సెల్లుమయము

సెల్లు చార్జి తగ్గి, స్విచ్ఛాఫె అయ్యెనా
లేనిపోని చెప్పరాని బాధ
కర్మకాలి సెల్లు కనబడకున్నదా
లోకమెల్ల చిమ్మచీకటింక!! (సెల్ ఫోన్ 1వ ప.)

అనుమానం 2,3 పద్యాలలో అనుమానం పెనుభూతం, అది ఆవహిస్తే దినదినం మనిషిని కృశింపజేస్తుంది. ఇది ఎక్కువ శాతం స్త్రీలలోనే కనబడుతుందనే భావంతో అకటా! అనుమానమొక్క అతివల సొత్తా! అని అతివలపై కవి చిన్న విసురు విసిరాడు. మఱల ఆలోచించి, అకటా! కులసతుల బాధకాద్యులు మగలే అని మహిళలను సమర్థించాడు. దీనికి త్రిమూర్తులపై వారి భార్యల అనుమానం, తరువాత వారి అనుమానానికి త్రిమూర్తుల ప్రవర్తన కారణమన్న విషయాన్ని చక్కని అర్థాంతరన్యాసాలతో కవి సమర్థిస్తాడు. దాంపత్యజీవితంలో ఎవరికి ఎవరిమీద అనుమానం కలిగినా నివృత్తి చేసికొంటే కాని మనసు తేలిక పడదు.

ప్రేయసి శీర్షికలో ప్రేయసిని పద్యంగాను, ఆమె తల్లిదండ్రుల్ని యతిప్రాసలుగాను, వంపుసొంపులు అలంకారాలుగాను నూపురాలు పాద గణాలుగాను, తనను రసంగాను చేసిన భావన అద్భుతమైనది.

హేసఖి! నిన్ను బద్యమని యెంచెదు, నీ తలిదండ్రులే యతి
ప్రాసలటంచు నెంచెద నలంకరణమ్ములు వంపు సొంపుగా
భాసిలునంచు నెంచెదను బాద గణమ్ములు నూపురంబులై
మ్రోసెనటంచు నేను దలపోసి, రసమ్ముగ నన్ను నెంచెదన్!!

(1వ ప)

ప్రేయసిని పద్యంగా ఊహించడం ఒక క్రొత్త మార్గం. అందులోను ఆమె తల్లిదండ్రులను పద్యరచనకు అడ్డుపడే యతిప్రాసలుగా పోల్చడం మరీ అందంగా ఉంది. తనను రసంగా పోల్చుకోవడం పతాకస్థాయి. సలక్షణమైన పద్యానికి రస స్పర్శ ఎంత

ప్రధానమో మనం ఊహించుకోవచ్చు. ప్రేమలేఖ, ప్రేమపాట్లు, సమాజం ఇలా కావ్యంలో ఏ కవిత చూసినా పరిణతి దశయే గాని ప్రారంభ దశ మచ్చుకైనా కనిపించదు. అంకితం నుండి అహం బ్రహ్మాస్మి దాక ఎదిగిన రమేశ కవితాలతాంగి పెద్దలకు నీరాజనాలు అర్పించి మంగళాంతమయింది. ఈ మలయ మారుత కవి రమేషు, శ్రీవిరించి శతకకర్త తమ్ముడు శ్రీవిరించి ఇద్దరూ గ్రంథకర్తలై తండ్రికి తగ్గ తనయులనిపించుకొన్నారు.

తల్లి మీనాక్షి సౌజన్య ధర్మబుద్ధి
తండ్రి అవధాని సుకవిత్వ తత్త్వదృష్టి
కలసి యిరువురు సుతులైరి కవులునైరి
పెండిలికి ముందె వీరలు తండ్రులైరి!!

సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్!

కె. కోటారావు
అనకాపల్లి
12.02.2010

అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ

డా॥ కేశాప్రగడ సత్యనారాయణ
రిటైర్డ్ ప్రిన్స్‌పాల్
ఆంధ్రపద్యకవితా సదస్సు రాష్ట్ర అధ్యక్షులు
రాజమండ్రి

పద్యం చచ్చిపోయిందన్నారు కొందరు. మరికొందరు పద్యాన్ని పాతిపెడతామన్నారు. తెలుగు భాషకు స్వతస్సిద్ధంగా అందాన్ని చేకూర్చి పెట్టిన పద్యరచనను ఎవరు ధ్వంసం చేయగలరు కనుక. ఒక తరం దాటిపోతే పద్యం చదివేవాడూ ఉండడు, పద్యం వ్రాసేవాడు అంతకన్నా ఉండడు అన్నారు మరికొంతమంది. ఇవన్నీ అసత్యాలని, భ్రమలని ఋజువు చేసారు గురుసహస్రావధాని డా!!కడిమిళ్ళ వరప్రసాదుగారి కుమారులు ఇద్దరూ కూడా. పద్యవ్యాప్తి తగ్గిపోతుందేమో అని మేమూ భయపడ్డాము. ఆంధ్రపద్యకవితా సదస్సుద్వారా తెలుగుపద్య వైభవాన్ని చాటిచెప్పాం. ఈనాడూ చెబుతూనే ఉన్నాం. కాని ఇంక ఆ అవసరం లేదు. కడిమిళ్ళవారి ఇద్దరు కుమారులుకూడ తెలుగుపద్యానికి ఊపిరి పోస్తున్నారు. వారు వ్రాసిన పద్యాలు చదువుతూఉంటే ఆ చిరంజీవులు పద్యాలు వ్రాసారా, లేక పద్యాలు చెప్పారా? అని సందేహం కూడ కలుగుతోంది.

ప్రస్తుతానికి వస్తే చిరంజీవి రమేష్ వ్రాసిన మలయమారుతము అనే ఖండకావ్యంలోని ఖండికలు కొన్ని దైవభక్తి ప్రపూరితాలు, కొన్ని దేశభక్తి ప్రబోధకాలు, మరికొన్ని మాతృభాషాసక్తి ప్రకటితాలు, మరికొన్ని పూర్వకవి మహత్వ సంవేద్యకాలు, ఇంకొన్ని ప్రకృతి పరిశీలకాలు,

ఇంకొన్ని సామాజిక సమస్యా నివేదకాలు ఇంకా కొన్ని హితోపదేశకాలు, చివరకు ఆత్మానంద సంధాయకాలు.

పచ్చి నిజంబు చెప్పి, పరిభాషల నేరిచి కూర్చి చిత్తమం
దచ్చును బోసినట్లు సముదంచిత సూక్తులతోడ గుండెలో
గ్రుచ్చుకొనంగ గైతల నిరూఢి వచింపుచు దండ్రినింక ని
క్కచ్చిగ మించిపోయితి ప్రకాండుడవైతి రమేశ! పూర్తిగాన్!!

ఏకవికైనా కవిత్వం చెప్పేటప్పుడు పదప్రయోగంపై సాధికారకత ఉండాలి. సంక్షిప్త పదప్రయోగంలో సమధిక భావప్రకటన చేయగలగాలి. ఆ సమయంలో సూక్తులు, జాతీయాలు అవసరమయితే వినియోగించుకోవాలి. అప్పుడు ఆ పద్యం కలకాలం నిలుస్తుంది. లేదా గాలికి కొట్టుకుపోతుంది.

వేళకు తిండి లభింపక
మూలను బడి పేదవాడు మూలుగుచుండన్
వేలుగ గోట్ల ధనంబులు
మూలను బడి బ్యాంకులందు మూలుగుచుండెన్!!

బ్యాంకులలో డబ్బు మూలుగుతూ పడిఉందనే సత్యం అందరికీ తెలిసిందే. కాని దానికీతడు తిండి లభింపక పేదవాడు మూలనుబడి మూలుగుతున్నాడనే నగ్నసత్యం దృష్టాంతంగా తెచ్చి, అందరి హృదయాలకు హత్తుకొనేలాగ పద్యం చెప్పాడు. ఒక చిన్న కందపద్యంలో ఇంత విశాలదృక్పథాన్ని తెలియజేయాలంటే కవికి పదాలపై సాధికారకత ఉండాలి. చిన్నతనంలో ఈ చిరంజీవి ఇటువంటి పద్యాలు చెప్పాడంటే, మున్ముందు తత్సాహితీ కేదారంలో ఎటువంటి సస్యాలు పండుతాయో వేచి చూడాలి.

సమాజం ఖండికలోని మారనె మారదా మన సమాజము వంటి పద్యాలు చదువుతుంటే పూర్వకవుల పద్యాలు గుర్తుకు వస్తాయి. **ప్రేమలేఖ**లోని పద్యాలు ఈ యువకుని మనోవీథినుండి వెల్వడిన భావతరంగాలై భావకవిత్వాన్ని స్ఫురింపజేస్తున్నాయి. **స్వగతము** శీర్షికలో బిడ్డగానెంచి దయను దీవింపుడయ్య అని ప్రార్థించడం ఈ యువకవి భవిష్యత్తుకు బంగారుబాట. అన్నీ వ్రాసి

నిరతము రామచంద్ర పదనీరజముల్ కడుభక్తితోడ సం
స్మరణము సేయువాని, భవసాగర భీకర వీచికాతతుల్
దరికొన జాలవెన్నటికి, దైవనిధానమె దిక్కు దక్క వే
మరు కుసుమాస్త్ర సంజనిత మాయలు కట్టడి సేయ సాధ్యమే!!

అని రామచంద్రునకు తన కవిత్వాన్ని నీరాజనమిచ్చాడు. ఆంగ్లవిద్యనభ్యసించి, ఎమ్.సి.ఎ వట్టా సాధించినా, గురుసహస్రావధానియైన తనతండ్రి కడిమిళ్ళ వరప్రసాద్‌గారినుండి అనుషంగికంగా వచ్చిన కవితాభ్యాసంతో ఈ తొలి ఖండకావ్యాన్ని లోకానికి అందించాడు. ఇంకా ఎటువంటి కావ్యాలు ఈ యువకవిద్వారా లభిస్తాయో చూద్దాము.

శుభాస్తే పంథాన స్సంతు

కేశాప్రగడ సత్యనారాయణ

రాజమండ్రి

25.02.2010

నేను చెప్పడం కాదు

డా॥ధూళిపాల మహాదేవమణి

'సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్' అన్నారు భర్తృహరి. రాజ్యభోగభాగ్యాలకంటె మంచి కవిత్వాన్ని ఆస్వాదించడమే చాలా ఉన్నతమైనది. ఆస్వాదించడమూ,ఆస్వాదింపజేయడమూ రెండూ సంభవిస్తే ఇంక ఆ అదృష్టానికి అంతే లేదు. అదిగో అచ్చంగా ఆకవితా పిపాసి చిరంజీవి కడిమిళ్ళ రమేష్.

తండ్రి గురుసహస్రావధాని కవితా బీజాలతో, తల్లి మీనాక్షి ఆశీర్వలంతో అచ్చంగా శారదాదేవి అనుగ్రహంతో రసజ్ఞలోకానికి సురభిళ మలయమారుత సౌఖ్యాన్ని అందించాడు రమేష్. పూర్వజన్మసంస్కారం లేకుండా కవితాసంపద ఎవరికీ సంభవించదు. ఆ పూర్వసుకృతం వెన్నంటి రాగా పితృపాదుని సలక్షణ శిక్షణ తోడుకాగా మొగ్గగానే సౌరభాన్ని పంచే కవితా సినృక్షతో మేధాబృంహణం కాగా ఆవిర్భూతమయింది ఈ మలయమారుతం. ఇందులో అన్నిరకాల శీర్షికలూ ఆయా పద్యాలతో నూరుశాతం సమన్వయిస్తున్నాయి. అత్తాకోడళ్ళని 'ఓడ బండి కరణి నొప్పుచుండు' అని అనుభవం లేకుండానే గొప్పసిద్ధాంతవాక్యంతో చెళుక్కుమనిపించాడు రమేష్. నన్ను బాగా అబ్బురపరిచింది 'ప్రేయసి' అన్న శీర్షిక

హే సఖి ! నిన్ను పద్యమని యెంచెదు ! నీ తలిదండ్రులే యతి
ప్రాసలటంచు నెంచెద నలంకరణంబులు వంపు సొంపుగా
భాసిలునంచు నెంచెదను బాద గణమ్ములు నూపురంబులై
మ్రోసెనటంచు నేను దలపోసి, రసమ్ముగ నన్ను నెంచెదన్.

ఇంకా ప్రేయసీ ప్రాంగణంలోకి రాని ఈ చిన్నారి చిరంజీవి పద్యకన్యనే ప్రేయసిగా చేసుకోవడం అద్భుతం. ప్రేయసి అనే పద్యానికి యతిప్రాసలు

తల్లిదండ్రులట ఇతని ప్రేయసికి ఆభరణాలు పద్యంలోని వంపు- సొంపులే. గణాలే నూపురాలు. ఇంక తానే అందులోని రసమట. ఓహో! ఎంత అందమైన భావన. నిజానికి పద్యాలు యతిప్రాసలనుండి పుట్టలేదు. కనుక వాటికి మాతాపితృత్వం చెల్లదు. కానీ పద్యానికి ప్రాణాలు యతిప్రాసలే. ఆ ప్రాణాలే పద్యానికి జీవం పోస్తున్నాయి. యతి అద్వితీయమైన మొదటి అక్షరం అయితే, ప్రాస తల్లి ద్వితీయమైన రెండవ అక్షరం.ఆవిధంగా తల్లిదండ్రులు ఎప్పుడూ మొదటి రెండుస్థానాలలోనూ అవినాభావంగా కలిసి ఉండి పద్యకన్య జన్మకారకులౌతున్నారు.ఎంత అందమైన భావన!

ఇలా ప్రతిశీర్షికలోని పద్యాలూ బాగా వ్యాఖ్యానించేకొద్దీ రసరమ్యాలు అవుతున్నాయి. ఇంతటి కవన అనుగ్రహం కలగడం చి.రమేష్ అదృష్టం. నేను చెప్పడం కాదు ఆ తత్వాన్ని మీరే చదివి, పరిశీలించండి. ఈ చిరంజీవి మరిన్ని కావ్యాభరణాలతో ఆ శారదాంబను సేవించాలని ఆశీర్వదిస్తూ ...

ధూళిపాల మహాదేవమణి
రాజమండ్రి
05.04.2010
సెల్. 9494002242

విచ్చియు విచ్చనట్టి విరి

గురు సహస్రావధాని
డా॥ కడిమిళ్ళ వరప్రసాద్

1. ఎంతటి భాగ్యరేఖ లిఖియించెనొ నా నుదుటన్ విరించి య
భ్యంతరమేమి వ్రాయుమని పల్కెనొ తండ్రి రమేశుడున్నత
స్వాంతులు శిష్యసత్తములు సత్కవులైరవధానులైరి నా
సంతతికూడ నేడు రససాగరమీదుచునుండె ధన్యుడన్॥

2. కవులై కవయిత్రులునై
యవధానులుగూడ శిష్యులైరిపుడు తనూ
భవులిర్వురు సత్కవితా
వ్యవసాయము సేయుచుండి రహమహమికతో!!

3. మంచిగురువుల నాకు జూపించితీవు
మంచి శిష్యుల నాకు గల్పించితీవు
మంచి బిడ్డల నాకు నందించితీవు
మించి భారతీ! దయను వర్షించితీవు!

4. పెండ్లికాక ముందె బిడ్డలు తండ్రులై
నన్ను దాత జేసినారు భళిర!
మనుమరాండ్రు నాకు మనసైన నేస్తమ్ము
లాడుకొనగ గూడి పాడుకొనగ!!

5. వచ్చియురాని పల్కులను బల్కెనొ! నా తొలిచూలు, నేటికిన్
విచ్చియు విచ్చునట్టి విరి, పెద్దమనస్సును జేసికొంచు మీ
రిచ్చెడి దీవెనల్ గొని రహించి, శ్రమించి, వచించు గాక మీ
మెచ్చెడి రీతి నిక్కము సుమీ! యొకనాటికి నన్ను నమ్ముడీ!!

కడిమిళ్ళ వరప్రసాద్

నరసాపురం

06.04.2010

సెల్. **9247879606**

పుత్రోత్సాహము తల్లికి

కడిమిళ్ళ మీనాక్షి
ఆంధ్రోపాధ్యాయిని
టేలరున్నత పాఠశాల
నరసాపురం.

అదేమిటి, 'పుత్రోత్సాహము తండ్రికి' అనికదా! అంటారు. మఱి నేను తల్లినిగదా! వృత్తిరీత్యా తెలుగుపండితురాలనయినా మావారిలాగా భావాన్ని పద్యంలో ఇమడ్చడం చేతరాదు. కానీ కొడుకులిద్దరినీ పద్యకవులుగా చూడగలగడం చాలా ఆనందంగా ఉంది. పద్యం వ్రాయాలంటే కాస్త ఓపిక, మఱి కాస్త కోరిక ఉండాలి. ఇద్దరు సంతానం కొడుకులు కావడంతో ఇంటిపని, వంటపని అంతా నేనే చూసుకోవాలికదా! పైగా ఉద్యోగం చేస్తూ. కూతురుంటే కాస్త చేదోడు వాదోడుగా ఉండేది మఱి. ఇంక ఓపిక ఎక్కడిది. పద్యం వ్రాసే కోరిక ఉన్నా అంత తీరిక ఎక్కడిది. ఈ మధ్యనే సరస్వతి అనుగ్రహం నామీద ప్రసరించినట్లుంది. మా ఇంట్లో ముగ్గురూ కవులు కావడంతో నాకూ కొంచెం భావావేశం కలిగింది. ఇప్పుడిపుడే పద్యం వ్రాయడం నాకూ పట్టుబడుతోంది.

ఇక మా పెద్దకొడుకు విషయానికి వస్తే, చదువు నత్తనడకైనా, పద్యం నడక పరుగెడుతుంది. తల్లిగా నాకంతకంటే కావలసిందీ, నేనంతకుమించి కోరుకునేదీ ఏముంటింది చెప్పండి.

'మలయమారుతం' అనే పేరుతో మావాడు వ్రాసిన ఈ మొదటి పద్యకృతిని నా తండ్రికి అంకితం ఇవ్వమన్న నా కోరికను అంగీకరించి, నాకు కన్నవారి ఋణం తీర్చుకొనే అదృష్టాన్ని, అవకాశాన్ని కూడా కలిగించాడు. అటు కూతురిగా, తల్లిగా, పాఠాలు నేర్పిన గురువుగా కూడా నాకు గౌరవాన్ని సంపాదించి పెట్టాడు. మా ఆశీస్సులు, మీ ఆశీస్సులు మా చిరంజీవికి మంచి భవిష్యత్తును అందిస్తాయని ఆశిస్తూ, తల్లిగా ఆశీర్వదిస్తున్నాను.

పెండ్లికాకముందె పెనిమిటి యవధాని
ఇప్పుడిపుడె బిడ్డలిరువురు కవు
లైరి వీరె స్ఫూర్తి యైరి నాకునిపుడు
మొదలుపెట్టుచుంటి మొదటి రచన!!

సుజన విధేయ
కడిమిళ్ళ మీనాక్షి

నరసాపురం
10.04.2010
సెల్ : 9440148848

అంకితం...

1. సచ్చిదానందైక సంతోష చిత్తుండు
దేవభాషారాశి కోవిదుండు
వేదాంత విజ్ఞాన విద్యాప్రవీణుండు
నిర్గర్వి నిర్మోహి నీతిమూర్తి
ఏకాంత నిర్మగ్ను డీశ్వర ధ్యానుండు,
భగవదారాధనా వర్తనుండు
శుద్ధాంతరాత్ముండు సూనృతాచారుండు
మితభాషి హితభాషి మృదుమనస్వి

తే.. నిశ్చలానంద మగ్న పాండిత్య వార్ధి
శ్రుతి కథిత మహావాక్య విశ్రుత విహారి
సాంద్రతర చంద్రికా నిభ చారుహాసి
కృష్ణ నామామృత పిపాసి కృష్ణశాస్త్రి.

2. అతడు సమర్థతగల సం
స్కృత భాషావిదుడు, సుగుణశీలుడు, తన సం
గతి దక్క తక్కినవయు
క్తతమముగ తలంచువాడు తాత స్వయముగా

3. తెల్లని రూపంబున తెల
తెల్లని దుస్తులు ధరించి తిలకము దిద్దన్
తెల్లని ఆకసమందున
అల్లననరుణోదయంపుటాకృతి నొప్పున్.

4. ఓర్పుగ మనుమడు వీడని
నేర్పుగ సుజ్ఞానమెంతొ నేర్పిన దయకున్
తీర్పగ జాలని ఋణమున
కర్పణగా నాదు కృతిని నంకితమిడుదున్.

5. అడుగకయె కోరి తినిపింప గడుపునిండు
దాక, అమ్మమ్మ గోరు ముద్దలను తింటి
నక్షరోచ్చారణమునందు నప్పుడపుడ
పశ్రుతికి తాత చేతిదెబ్బలను తింటి.

6. ఓర్పున భూదేవియనగ
నేర్పుగ సంసార మెల్ల నెట్టుకు వచ్చెన్
కర్పూరమువలె బిడ్డల
కేర్పరచెను కృష్ణవేణి యెన్నియొ దీప్తుల్.

7. పార్వతి పరమేశ్వరుదన
పర్వమనన్ నేత్రములకు బరగెడి యీ మీ
యిర్వురకును నా దైవము
సర్వసుఖములిచ్చుగాత సంసారమునన్

8. భాస్కర లక్ష్మియు స్వారాజ్య లక్ష్మియు
మీనాక్షియును శాంత మీదటమతి
రత్నము సుమయును రాధయు నేడ్గురు
సప్త సింధువులుగా సౌరుమీర
సప్త సింధువులకు స్థానంబునాగ స
ర్వాధార కృష్ణవేణమ్మ యొప్ప
భూమికి నేడు సముద్రములకు శీత
కిరణుడై కొమరుండు కృష్ణమూర్తి

తే.. చెలగి, పున్నమ వెన్నెల చిలుకు చుండ
గగన రూపంబు తానౌచు కన్న తండ్రి
కృష్ణశాస్త్రి మనీషి సంస్కృత విదుండు
పెద్దదిక్కౌచు మమ్ము దీవించుచుండు!!

9. భాస్కర మూర్తికి భార్యయౌ రాధకు
పున్నెపు ప్రోవుల ముద్దు పట్టి
ఆటల పాటల నల్లరి చేష్టల
కోటలు దాటెడి మాటకారి
తాను కోరిన దాని కౌను గాదని యన్న
ముద్దుతో సాధించు బుద్ధిశాలి
మృత్యుంజయుని మంత్ర మత్యంత భక్తితో
నాలకించి మరల నాలపించి

తే.. పరవశించుట గాంచిన బరమశివుడు
తల్లి దండ్రియు దన్మయత్వమ్ము గొనరె
ఎల్లకాలంబు శివుడు దినేశునకును
ఆయురారోగ్యములనిచ్చు నాదరమున.

పితామహుడు

1. రామజపము దక్క లౌక్యమే యెఱుగని
స్వార్థ మెఱుగనట్టి శాంత మూర్తి
యీత తెలియు పిదప లోతుతో బనియేమి
మత్పితామహుండు మాన్యమూర్తి.

2. చిన్న తనము నందు నన్ను సైకిలుపైని
కొడుకు కొడుకటన్న కూర్మితోడ
ఊరు వాడ త్రిప్పె నూసులన్ జెప్పుచున్
నన్ను గన్నతండ్రి కన్నతండ్రి.

3. మేము చేసికొన్న మితపుణ్యమందునో
మమ్ము విడిచి మీరు మఱలిచనుట
మనుమడడుగు చుండె మనసార! యో తాత !
మఱల నొక్కమారు మఱలి రావె!!

4. స్వార్థ బుద్ధి లేక, పరమభక్తిని గల్గి
శివ శివా యటన్న చింతతప్ప
చీకు చింత దరికి జేరదీయనివాడు
నన్ను గన్న తాత కన్న తాత!!

5. అనితర సాధ్యమేమొ తనకబ్బిన శాంతగుణమ్ము మాటలన్
మనసున జేతలందు నొకమాత్రపు కల్మషమేనెఱుంగడా
ఘన కడిమిళ్ళ వంశమున గల్గినయట్టి యజాతశత్రువౌ
వినుతుడు మత్పితామహుడు వేంకట రామయశాస్త్రి మ్రొక్కెదన్!!

6. ఘన కడిమిళ్ళ వంశమున గల్గినయట్టి యజాత శత్రువౌ
యనదగునట్టి నీకిదియె యంజలిగా స్మృతిరూపకంబుగా
ఘన పితృదేవతార్చనము కైతల పల్కులపూవుదేనెలన్
మనుమడు నేడిదే సలిపె మన్నన సేయవె **భారతీపతీ**!!

7. వీరలుభయులకును పెద్దకొమరుడగుచు
గణుతికెక్కె నన్ను గన్నతండ్రి
అన్న పదవి వాని కందించినారలు
బాల కాంతి దేవి పయి సుజాత!!

8. భర్తమాటకెపుడు బదులు పల్కని భార్య
కన్నబిడ్డలకును గల్పవల్లి
వదినె పిల్లలనిన వల్లమాలిన ప్రేమ
పేరు బాల మాకు ప్రేమ చాల!!

పితరౌ వన్దే

1. తల్లియు దండ్రియున్ గురుడు దైవమటంచునుబల్కి ముందుగా
దల్లిని గౌరవించుటగదా! మన సంస్కృతి నేర్పె గావునన్
తొల్లి మదీయ మాతృపద తోయజముల్ హృదయాంతరంబునన్
తెల్లముగాగ నిల్పుకొని ధీరత పల్కెద సత్కవిత్వమున్.

2. కరముల్ సాచుచు తల్లివంకకురుకన్ గాల్జారి నేలన్ బడన్
ధరపై బడ్డ మహావిపత్తనగ నేత్రమ్ముల్ చెమర్చంగ రే!
అరరే ! బంగరు తండ్రి ! వెఱ్ఱికొడుకా ! యట్లేడ్వబోకంచు దా
బరుగున్ బెట్టి కవుంగిలించి కరమాప్యాయంబు జూపుంగదా

3. అమ్మ చేతి వంట యావురావురనుచు
నారగించి మరల యడిగినపుడు
దాను దినక మరల దమితోడ దినిపించు
గన్న తల్లి భువిని గల్పవల్లి!!

4. అడుగుట యాలస్యంబుగ
దడయక పలుకాడు పద్యధారకు సభనే
ఱ్ఱడియెడు చప్పట్లు దెలుపు
కడిమిళ్ళ వరప్రసాద ఘనునిన్ దండ్రిన్!!

5. అవధానమందు బద్యాశుగ విస్ఫూర్తి
నలరించుచో నపరార్జునుండు
వేదికాధిష్ఠిత పృచ్ఛక తతి సమ
స్యలనెల్ల నడగించు సద్భిషక్కు
పండితావళి గుండె బసిడి పండించెడి
సారస్వతాసార జలధరంబు
సంస్కృతాంధ్రములందు సమమైన ప్రౌఢితో
నలరించు గురుసహస్రావధాని

తే.. శాస్త్ర సాహిత్య పాండిత్య సాగరుండు
గురుపదాంబురుహ ధ్యాన కోవిదుండు
అరయ శిష్యులపాలిటి పరుసవేది
గరిమ కడిమిళ్ళ వంశాబ్ధి కల్పతరువు!!

6. భాషావిదగ్ధత బహుకావ్య రత్నముల్
కరమొప్ప రచియించు కవివరుండు
తనశిష్యులందరిన్ దనయట్ల చేసిన
యొజ్జలందరియం దనుత్తముండు
సమయ సంభాషణా చాతుర్యమున సభ
నుఱ్ఱూతలూగించుచుండు దిట్ట
సహజ పాండిత్య సంజనిత విస్ఫురదచ్ఛ
చంద్రికల్ పచరించు చందురుండు

తే.. అతని హృదయంబు నిర్మలమైన సరసు
అతని వదనంబు భారతికాకరంబు
అతని కవనంబు వరపాశుపత నిభంబు
అతడు కడిమిళ్ళ కవిధీరుడక్షరాల!!

7. సృజన పోషణ లయములు చేయునట్టి
బ్రహ్మ విష్ణు మహేశ్వర పాదములకు
బ్రతిగ మదినెంచి నుతియింతు ప్రతిదినంబు
జన్మనిచ్చిన పితరుల చరణములను!!

8. తెలియ దల్లి తండ్రి తెలుగు పండితులౌట
యొక్క బడిన వారలొజ్జలగుట
వీరలిద్దరకును విద్యార్థి నేనౌట
సుతుడ గూడనగుట సుకృతమేమొ!!

స్వగతము

.1. పద్యమో గద్యమో హృద్యమై యున్నచో
రాగమ్ము చూపరే రసికజనులు
భావ వైశారద్య పటిమ లేకున్నను
బలుకాదరింపరే యిలను బుధులు
మత్కావ్య కన్యకా మంజు వాగ్విన్యాస
మాహ్లాదమీయదే యందరకును
పెద్దవారలు మీరు పిన్నవాడను నేను
బల్కులన్ దప్పులు పట్టకుండ

తే.. సాదరంబున సుకవి రాజన్యులార!
కరుణమీర సారస్వతాకారులార!
బిడ్డగానెంచి, దయను దీవింపుడయ్య
యెపుడు వేంకట సత్య రమేశు నన్ను!!

2. కవినా ! నాది కవిత్వమా ! సుకవులాకర్ణించి హర్షింతురా
కవిమర్యాదల కెన్నడేని గృతిలో గష్టంబు వాటిల్లెనా
కవిగా నా తొలిచూలి బిడ్డ, కవిలోకం బెల్ల రంజిల్లగా
శ్రవణానందము గూర్చి సత్కవుల సౌజన్యంబు నార్జించునా !

3. పూలు ఫలాలు పక్షులును పున్నమ వెన్నెల సూర్యకాంతి కా
వ్యాలు కవిత్వ సంపదలు వానలు వాగులు వృక్షజాతి శా
స్త్రాలు పురాణగాథలును సాక్షులు నాకని యట్టి వానికిన్
బోలె వసించు నేనెటుల పూజ్యుల మన్నల నందుకొందునో.

4. మెండుగ విద్యలు నేర్చిన
పండితుడని లోకమెల్ల బల్కందగు, న
ప్పండితునికి గొడుకౌటను
పండిత పుత్రుండనంగ భావ్యంబగునే.

5. కన్న వారి కేను గారాబు పట్టిని
బంధు వర్గమన్న భయము భక్తి
గురుల విలువ నెపుడు గుఱుతెరింగెడివాడ
చెలిమి పంచు వారి స్నేహితుడను.

6. చిన్న నాటి నుండి నిన్న మొన్నటి దాక
కాలమంత వృధగ గడపి నాడ
అరయ కన్న వారి యాశీస్సు బలమేమొ
కవిత చెప్పనట్టి కడిమి కలిగె!!

7. తల్లి మీనాక్షిలోని వాత్సల్య గుణము
తండ్రి కడిమిళ్ళ యొసగు విద్యాధనమ్ము
తమ్ముడు విరించి ప్రేమయు దక్కియుండ
నాకు లోటన్న దేమిటి లోకమందు.

8. ఎంత వృక్షమునకు నంత గాలి పగిది
వెతల తోడ జనుల బ్రతుకు లొప్పె
ఎవరి కెవరు గాని యేకాకి నడకలో
పద్య మొకటె పిలిచి బాధలడిగె.

9. చదివితిని టెన్తు నింటరు
చదివితి డిగ్రీని దాని చదివిన పిదపన్
చదివితి ఎమ్.సీ.ఏ నే
డిదిగిదిగో కవనవీథికేగుచు నుంటిన్

10. జీవితంబున పరుల యాచింపకుండ
నొరులు ననుగాంచి జాలిని నొందకుండ
పయన మప్పుడు మంచంబు పట్టకుండ
బ్రతుక గల్గుట జన్మసాఫల్య మనెద

మలయ మారుతము

పద్యాకృతి

ఎంతటి స్నేహశీలివా గదే ! నినునేస్తముగా గొనంగ నే
నెంతటి భాగ్యశాలినొ గదే ! పలుకాడగ తోడులేని యే
కాంతపు వేళలందు నను నాప్తునివోలె సమాదరించి నీ
పొంతను సేద తీర్చితివి ! పుస్తకమా విలువైన బంధమా !

కటిమిళ్ళ రమేష్

ఇందులో ఉన్నవి..

1. ప్రాంజలి
2. వందేమాతరమ్
3. తెలుగు తెన్సు
4. మలయమారుతము

1. ప్రాంజలి

1. శ్రీహరి నామ మహత్త్వము
శ్రీహరి పదపద్మ నిత్యసేవా ఫలమున్
శ్రీహరి గుణకీర్తనమును
శ్రీహరి రూపంబు చింత సేయవె మనసా!!

2. వెన్నున్, పద్మదళాయతాక్షు, జగతీవిఖ్యాతు, సత్యప్రియున్
కన్నెల్ కోరెడు వన్నెకాని, రసశృంగారాబ్ధి శీతాంశువున్
పున్నెంబెంతయొ సేసి ప్రీతిమెయినే మూర్తిన్ బొదంగందురో
వానిన్ భక్తి మెయిన్ మదిన్ గొలిచెదన్ వాంఛించి సద్బుద్ధినిన్!

3. నెఱి నిను నమ్మినాద మును నేరములెంచుచు, విన్నవించినన్
మొఱ వినకున్న దిక్కెవరు? మోహపుటగ్ని బులుంగువోలె నే
నరుగుచునుంటి నెయ్యెడల నాపద వచ్చునొ యేమొ! మాధవా!
తెరువును జూపుమా! బ్రదుకు ద్రిప్పకు మోహపు రాట్నమందునన్

4. తిరుమల వేంకటేశ! యెద తీరనిబాధల స్రుక్కుచున్న నీ
వరయవొకింత పద్మభవునాలియు జూపదు జాలి సుంతయున్
హరునకు బట్టదాయె జగదంబయు నాతనిజాడ సాగుచున్
మరచెను నన్ను నీసుతుడు మా తలవ్రాసిన వ్రాతపుణ్యమే!!

5. వారిజ నాభ! రత్నగిరి వాస! విరించి సృజించు సృష్టికా
ధారము నీవ భక్త వరదాత! వికుంఠ నివాస! ఘోర సం
సార విదూర! సంతతము సాంతము సాంత్వనమున్ ఘటింపుమా
నేరములెంచి చూడకుము నీదయ నించుక చూపు నా యెడన్!!

6. మిక్కిలి నేర్పుతోడ మెలమెల్లగ మెల్లగ మెల్ల మెల్లగా
నొక్కడు నొక్కడొక్కడుగ నొక్కని వెన్కను నొక్కడొక్కడై
యొక్కని పైని నొక్కడుగ నుట్టిని దాచిన పాలమీగడల్
చక్కగ నారగించి కడు జక్కగ బారెడు కృష్ణు గొల్చెదన్!!

7. ఆయువు కల్గియుంటి, విబుధాశిషముల్ గొనియుంటి, యాసలన్
రోయక యుంటి, నీ పదసరోరుహ చింతయు లేకయుంటి, నన్
బాయక వేదనల్ విషయ వాంఛలు పైబడి సొక్కుచుంటి, నా
రాయణ! నీదె భారమిక రాగల కాలము కాపు కాయుమా!!

8. ఎవ్వనికి బిడికెడటుకుల
బువ్వగనిడ సంతసించి పూర్ణ ఫలమ్మున్
రివ్వున జేర్చె గుచేలున
కవ్వరదుని వాసుదేవు నచ్యుతు గొలుతున్!!

9. ఎవ్వాని రంజింప యవ్వాణి పలికించు
రసరమ్య రాగాలు రంజితముగ
ఎవ్వాని సేవింప నింద్రాది సురకోటి
సత్యలోకము జేరు సంతసమున
ఎవ్వాని మెప్పింప నెవ్వానికైనను
వనములాశ్రితమౌను వైభవముగ
ఎవ్వాని వ్రాతచే నిలపైని జరియించు
జంతుజాలములెల్ల వింత గొలుప
ఎవని దయచేత వేదంబులిలకు జేరె
ఎవని కృపజేత మునికోటి భవము వీడు
అతని పరమేష్ఠి జనకోటి యార్తిహరుని
వేడుకొందును నాలోని వెతలు తీర!!

10. శివనామంబు జపంబుగా, దపముగా, జిన్మాత్ర రూపమ్ముగా
భవ వారాశి దరింపజేయు దరిగా, ప్రాగ్జన్మ పుణ్యంబుగా
కవితా దాయినిగా, మనోజ శర సంఘాతాంధకారావళీ
రవిగా, యాశ్రిత పారిజాతముగ నారాధింతు నెల్లప్పుడున్

11. స్థిరముగ సర్పరాజు గళసీమ నలంకృతమయ్యె, చేతియం
దరయ ద్రిశూలముండె, బ్రళయాగ్నికి చూడ్కి నివాసమయ్యె, భీ
కరయగు కాళి యాలియట, కంధరమందు విషంబు నిల్చె నీ
శ్వర! యెటులబ్బెనయ్య! పటు శాంతము భక్తులనెల్ల బ్రోవగన్!!

12. మఱచితివేమిటయ్య యణుమాత్రము నిశ్చలభక్తితోడ ని
న్నిరతము గొల్వలేదనుచు నిర్దయతో నను బార్వతీశ! నా
తరపున నిల్చువారెవరు? తండ్రివి నీవె దయన్ ఘటింపమిన్
వరములు కోరబోనెపుడు వాంఛలతో గడతేరనీకుమా!!

13. సొంపగువాడు, చంద్రకళ జూటముపై నగయైన వాడు, వా
రింపను జాహ్నవిన్ దగినరీతి ధరించినవాడు, ఫాలమం
దింపగు జూడ్కివాడు, జగదీశుడనన్ దగువాడు, మాకు స
త్సంపదలిచ్చి కాచునట సాంతము స్వాంతమునందు నిల్చుచున్!!

14. వాసుకి హారమై, భువన భాండములన్నియు నీదుసృష్టియై
వాసము శైలమై, కలుగు బ్రాణిచయమ్ము నపత్యరూపమై
ప్రాశనమై హలాహలము పర్వత పుత్రిక యర్ధభాగమై
వాసికి నెక్కినట్టి నిను బల్కిన పల్కులె వేదమంత్రముల్!!

15. చల్లని తెల్లని కొండల మధ్యన జక్కగనుండెడి యీశునకున్
మల్లియ కైవడి చంద్రుని దాల్చిన మా యిలువేలుపు పార్వతికిన్
మెల్లగ యుండ్రములెల్ల భుజించుచు మోదము గూర్చు గణేశునకున్
చల్లని దీవెనలందగ జేయగ సాంతము గొల్చెద భక్తిమెయిన్!!

16. చిత్తజు బూది జేయు ధృఢ చిత్తుని జిత్తములోని కోర్కులన్
చిత్తుగ జేసి, చిత్తమున జేటునడంచి, వసించు మూడునాం
డ్లుత్తమ పుత్రుడౌ విధము నొప్పగ సాంతము కాచుకైవడిన్
బత్తిగ గొల్తు విద్దియలపట్టునొసంగ జయంబులందగన్!!

17. కమలజు గన్నతల్లి, సుమకాంతులనొప్పెడి శోభితాంగి, పు
న్నమవలె జల్లనైన సుమనంబున బ్రీతిని వెన్నునుంచి, చి
త్రముగ దనంత దానుగ సతంబు వికుంఠు నెడంద నిల్చుచున్
విమలమతిన్ మమున్ గనెడి విష్ణుపురంధ్రిని లక్ష్మి గొల్చెదన్!!

18. వెన్నుని గుండెనుండు సిరి! వెన్నెల తేని యనుంగు సోదరీ!
చెన్నగు బద్మమందు విలసిల్లెడు క్షీరసముద్రపుత్రి! ని
న్నెన్నగ భాష రాని భవమెంతయు నొల్లను బూని కోడలా
యన్నలువాయి యాలి నను నర్మిలి సాకగ మాట చెప్పుమా!!

19. పాలకడలిని జిలుక దద్భలము నీవు
చక్రి హృదయమ్మునందుండు జాణవీవు
పొడయు వెన్నెలతేని తోబుట్టువీవు
చెలగి నన్ గృప జూడంగ చెల్లు నీకు!!

20. పలుకు తేనెల జల్లు పదము మోక్షపుటిల్లు
పాపముల్ పోద్రోలు భద్రవీవె
యాది శక్తివి నీవె యఖిల సృష్టియు నీవె
యాద్యంతములు నీవె యంబవీవె
వేదరూపిణివీవె విబుధ వందితవీవె
పరమహంసలు గోరు వాసమీవె
కైలాస శిఖరాన గరళ కంఠుని చెంత
వాగర్ధ రూపమై వరలుదీవె

తే.. సకల సృష్టిని శాసించు శంకరుండు
సకల సృష్టిని బాలించు జక్రధరుడు
సకలమును గూడ సృష్టించు స్రష్ట వారి
సేవలందెడి నీకెట్టి సేవ తగును?

21. సంగీత సాహితీ స్తనయుగ్మ ధారిణీ
భక్తజనార్చిత పాదయుగళి
రమణీయ చతురాస్య రసనాగ్రవాసినీ
కొంగ్రొత్త కుసుమంపు కోమలాంగి
సితచంద్ర చంద్రికా స్మితనిత్య భాసినీ
వరకచ్ఛపీయుత పద్మపాణి
భావసంభరిత కావ్యవన సంచారిణీ
త్రైలోక్య విదిత సౌందర్యరాశి

తే.. వేద వేదాంత రూపిణీ ! విశ్వ జనని !
సకల విద్యా ప్రదాయినీ ! జాడ్యహారిణి!
సుతుల మోయమ్మ మము జాలి జూడవమ్మ
జయము లీయవె మాకు హే శారదాంబ !

22. తెలిదమ్మి విరిపైని జెలగు చక్కని తల్లి
కొలుతునమ్మా నిన్ను నలువరాణి
యంచ వారువమెక్కి యలరారు నమ్మరో
పూని గొలుతునమ్మ బుధుల జేరి
ఉత్తమోత్తమమైన పొత్తమందున నిన్ను
బత్తితో దర్శింతు పరము కోరి
చేత బంగరువీణ చిలుకబోటియు గల్గి
చల్లగా జూచెడి తల్లివీవె

తే.. నన్ను దయ జూడకున్నచో నాదు మొఱల
వినుచు నార్తి దీర్చెడివారు గనగ నెవరు
విద్యలాయురారోగ్యముల్ వినయమొసగి
విజయమీయవె శారద! వినుతులివియె!!

23. చెలువుమీర వీణ జేపట్టి సకల వి
ద్యా విషయమొసంగి ధ్యానమొసగి
మమ్ము కృపను జూచి, మాకు శ్రేయస్సును
గల్గజేసి, వాణి! కావుమమ్మ!!

24. అమ్మా! వాణి! దయాంబురాశి! జననీ! యానంద సంధాయినీ!
తమ్మిన్ బుట్టినవాని యాలి! విబుధుల్ ధ్యానించు వాగ్రూపిణీ!
నమ్మంజాలిన వాడనమ్మ దయ వీణాపాణి! జూపంగదే
నెమ్మిన్ గొల్తును నీదు పాదయుగమున్ నిత్యంబు జిత్తంబునన్!!

25. అక్షర రూపమై బుధులకక్షయమైన యశస్సు గూర్చి, సం
రక్షణ జేయు వాణి! యనురాగము జూపకయున్న నీ కృపా
వీక్షణ వృష్టి నెయ్యెడల వేడిన పై బ్రసరించి, సంతతా
పేక్షను జూపువారెవరు బిడ్డను నాపయి నల్క కూడదే!!

26. ఎందరికెన్ని రీతులుగ నెంతయు గూర్మిని గూర్చునట్టి నీ
వెందులకమ్మ నా పయిని నింత యుపేక్ష వహించితీవు రా
బందులవోలె నోటములు పైబడ భీతిలుచుంటి విన్నపం
బందవె వాణి! పద్మభవు నాలివి నీకు నసాధ్యమున్నదే!!

27. అమ్మా! శారద! నన్ను జాలి గనుమా! యస్తిత్వమున్ జూపుమా
నెమ్మిన్ నా మొఱనాలకించి, మదమున్ నిర్మూలమున్ జేయుమా
యిమ్మా సజ్జన సాహచర్యమును నాకిమ్మా సదాచారమున్
గొమ్మా నా వినతిన్ బ్రశాంతినిడి కోర్కుల్ వాపి, నన్ బ్రోవుమా!!

28. రామా ! కదు భక్తిని, తమ
నామంబును తలతు నెపుడు నానా విధులన్
కామితమైన పథమ్మున
క్షేమంబుగ జేర్పుమయ్య శ్రీరఘురామా !

29. రామా ! నీ నామంబును
నీమంబుగ భక్తితోడ నిరతము గొలుతున్
కామిత మొక్కటి కోరెద
మా మా హృదయాల సహనమాధురి నింపన్.!

30. ఆద్యంత రహితుండు నానంద నిలయుండు
శౌరి సీతాజాని చక్రపాణి
కౌసల్య కొమరుండు కారుణ్యధాముండు
రాకేందువదనుండు రావణారి
వేదాంతవేద్యుండు విద్యాప్రకాశుండు
కైవల్యసంధాయి కైటభారి
శేషేంద్రశయనుండు సీతావిధేయుండు
వైకుంఠనిలయుండు భద్రమూర్తి

తే.. అతడేకైక నాథుండు నాస్తికులకు
నాతడేకైకనాథుండు నాస్తికులకు
నాతడేకైకనాథుండు నఖిలమునకు
నాతడానందములకెల్ల హేతువిలను!!

31. మనమున రామచంద్ర! హరి! మాధవ! కేశవ! యచ్యుతా! ప్రభూ!
యనుచు భజించువారెటుల నాపదలందుదురయ్య రాఘవా!
కనబడు సృష్టియందు నిను గాంచుట నేర్చినయట్టి వారికిన్
వనమును నాకమౌ పరమవాసము నీ చరణాబ్జసీమయౌ!!

32. అమ్మ! యొకింత నన్ను గనవమ్మ సదా రఘురామ పాదప
ద్మమ్ములధ్యాస తక్క మరుదానినెఱుంగని వాడనమ్మ! నన్
నమ్మగదమ్మ! సత్వరమె నాథుని మోమును జూపుమమ్మ సీ
తమ్మ! భవత్పదాబ్జముల యానగ జెప్పుచునుంటి నమ్ముమా!!

33.. రావణనీతయై సుగుణరాశి యశోక వనమ్మె వాసమై
యావలి కోననున్న పతి నా రఘువంశ సుధాబ్ధి సోమునిన్
భావమునందు నిల్పుకొని బాధనెడంద నడంచి, యెట్టకే
బావని గాంచి యూరడిలు పావనియోరిమి నన్ను గాచతన్!!

34. వారిధి దాటి లంక జని వారిజలోచన సీత గాంచి, రా
మా రఘురామ యంచు పలుమారులు కుందెడి రాముబోటికిన్
దారసమంది, రామపదదాసుడ నేనని పల్కినట్టి యా
శ్రీరఘురామదూతను స్మరించెద నెల్లెడ కార్యసిద్ధికిన్!!

35. వరగోదావరి కేలుసాచి, పతియౌ వార్ధిన్ సమాశ్లేష సౌ
ఖ్యరసానందపుటబ్ధి ముంచుగతిమై కన్పట్టు నచ్చోట సుం
దరమందస్మిత లక్ష్మితో వెలసి, యంతర్వేదిలో మమ్ములన్
జిరకాలంబును గాంచుచుందువట లక్ష్మీనారసింహప్రభూ!

36. ప్రాతఃకాలమె నిద్రలేచి నియతిన్ బాటించి సద్భక్తితో
ప్రాతస్సంధ్య నుపాస్తి జేసి సమయాభావంబు గాకుండగా
చేతఃప్రీతి జనింప నర్ఘ్యమిడి సంసేవింపగా భాస్కరా!
పూతంబైన మనఃప్రవృత్తినిడినన్ మోక్షంబుగా నెంచెదన్!!

37. స్థిరమతి నితిహాసములౌ
వరజయ రామాయణములు భాగవతంబున్
నిరతము పఠియింపగవలె
నిరవధి విజ్ఞాన మెల్ల నేర్వగ వలయున్.

౨. వందే మాతరమ్

1. ఇది మన జాతినినాదం
బిది గతవైభవపు దీప్తి యిది మనదేశా
భ్యుదయపు కీర్తిపతాకం
బిదె భారతజాతినెల్ల నేకము జేసెన్.

2. అమ్మా! నీకు నమస్కృతిన్ సలిపి పల్హాదంగ భావంబులో
సమ్మానించుచు నిన్ను నీసుతు లహింసాబద్ధులై ధీరులై
పొమ్మింకంచు బ్రిటీషు పాలకులపై పోరాటమున్ జల్పెగా
నెమ్మిన్ హే భరతాంబ ! చేయుదును వందేమాతరమ్ గానమున్

గాంధీమహాత్ముడు

3. హే జాతిపిత! సుధీరా !
తేజోమయమూర్తి! విశ్వదేశిక! వినుతా!
రాజిత కీర్తిసుధాకర!
జేజే గాంధీమహాత్మ జేజేల్ గొనుమా !

4. చేజేతుల స్వాతంత్ర్యము
చేజార్చిన వేళ తిరిగి స్వేచ్ఛానిలముల్
చేజిక్కించిన హే గాం
ధీజీ! మీ ఋణము మేము తీర్పంగలమే.

5. పేరుకు నిను జాతిపితయని యందుము
మేము గాని నిజము హేమహాత్మ !
కన్నతల్లి వోలె క్ష్మాతలంబును బోలె
సహనగుణము నీకు సహజమయ్య !

6. నీ భిక్షయె స్వాతంత్ర్యము
నీ భిక్షయె నేటి స్వేచ్ఛ నిజముగ నేడీ
సౌభాగ్యము సౌశీల్యము
శోభిల్లగ కారణంబు జూడగ నీవే.

7. బోసినవ్వుల యందు రాసి పోసిన యట్టి పున్నమ వెన్నెల పూవులొప్పు
సంగ్రామ రంగాన సవ్యసాచి తెలుంగు
మడమ త్రిప్పనియట్టి నడకయెప్పు
వజ్రి చేతులనుండు వజ్రాయుధము భంగి
పలుకులందున సత్యపటిమ యొప్పు
విమలమందాకినీ విశదపద్మము వోలె
రమణీయ మమృతాంతరంగమొప్పు

ఆ.. తండ్రి కోపమూని తనయుని దండింప
తల్లడిల్లునట్టి తల్లివోలె
హింసనెవ్విధిని సహింపజాలక నిరా
హార దీక్షగొన్న యమృతజీవి!

అమరజీవి

8. బట్టబయలు గాని మట్టిలో రత్నమై
తెలుగుజాతి రత్నమలరుచుండ
అరవ జాతినుండి యాంధ్రజాతివిముక్తి
నంద జేసెకాదె అమరజీవి!!

9. ప్రాణములను విడిచి ప్రత్యేకరాష్ట్రంబు
దెచ్చి పెట్టినట్టి ధీరుడతడు
కనగ నాంధ్రికపర గాంధీమహాత్ముండు
తెలుగు తల్లి నుదుటి తిలకమతడు!!

10. క్ష్మాతలంబున కారణ జన్మునిబలె
నవతరించెనటన్న గాదతిశయోక్తి
యాంధ్రి విస్మరించునె వాని యాత్మబలిని
ప్రాణ సముదయ్యె శ్రీరాములయ్య నిజము!!

11. స్వార్థ సంకుచితపు భావ శృంఖల వీడి
తెలుగు వారికొఱకు దీక్షబూని
నీరసించి తుదకు నెల్లూరికోమటి
స్వేచ్ఛ కనక మునుపె చేరె దివికి.

12. జాతి గర్వించునట్టి నిస్వార్థ మూర్తి
తిరిగి రాని లోకమునకు దరలిపోయె
మంచివారిని జూడగ మక్కువేమొ
దరికి గొంపోవ దైవంబు తలచుమండు.

13. నిరుపమానుడైన నిస్వార్థ శీలుడా-
హారములను గొనుట నాపివేసి
యేబదారు దినము లెట్టులో బిగపట్టి
వెడలిపోయె మనల విడిచిపెట్టి.

14. అంటరాని తనంబున హరిజనాళి
కాలయ ప్రవేశార్హత కద్దు తెలుప
దాని నిరసించి పూని యుద్యమము సలిపె
హరి జనోద్ధారశీలి యా అమరజీవి.

15 ఎన్నగ త్రిలింగదేశం
బెన్నటికిని మఱువబోదు హే మహితాత్మా!
నిన్నును మఱచిన వేళల
నన్నంబును గుడుచు పశువులౌదుము గాదే!!

శివాజీ

16. దేశమాత ఋణము తీర్చుబిడ్డల గన్న
తల్లులందు మొదట తలపదగిన
జిజియబాయి కలలు నిజము జేసెడిరీతి
బరగె ఛత్రపతి శివాజి నృపుడు!!

17. మొగలు బాదుషాలు పోర్చుగీసులవారు
భరత దేశమందు పదము మోపి
కుటిల నీతితోడ కుట్రలెన్నియొ పన్ని
పాలకులను జేసె బానిసలుగ!!

18. ఎందుండో యిటకేగుదెంచి మనలన్ హిందూ ప్రజన్ బల్మితో
ముందున్ వెన్కను గానకుండ మొగలుల్ మోసంబుతో నేలగా
సందేహింపక ధీరతన్ సలిపెగా స్వాతంత్ర్య సంగ్రామమున్
హిందూరాజ్య పునఃప్రతిష్ఠ గుఱిగా నేలెన్ శివాజీ భువిన్.

19. మొగలులు పోర్చుగీసులు విభుల్ మును రాక్షసకోటి స్వర్గమున్
బగబడి నాక్రమించినటు భారతభూమిని నాడు ముష్కరుల్
తగ దమ బల్మితోడను కుతంత్రము చేతను గెల్వ వారినిన్
యుగ పురుషుండువోలె కరమొప్పనెదిర్చె శివాజీ ధీరతన్.

3. తెలుగు లెస్స

1. చూడ తెలుగు వారి సొత్తైన పద్యంబు
నాదరింప రేమి యాంధ్రులకట!
దేశ భాషలందు తెలుగు లెస్సనుమాట
మఱచి రేమొ! నేటి తరము వారు.

2. తెలుగు జాతి కీర్తి దిగ్దిగంతములకు
వ్యాప్తి జేసి నట్టి పద్యమునకు
ఎన్ని జన్మలెత్తి ఋణము తీర్పగలము
తెలుసుకొనుమ ఘనత నిలుపుకొనుమ.

3. నన్న యాది కవులు వెన్నమీగడ వంటి
పద్యకావ్యములను బలికినారు
పూర్వజన్మ సుకృత పుణ్యమూలంబుగా
వాని ననుభవించు ప్రాప్తమబ్బె.

4. నిధులు కలిగికూడ నిర్భాగ్యులుగనుంట
తెలుగులార! మీకు తెలియునొక్కొ!
నేడు సూపుచున్న నిర్లక్ష్య భావంబు
ముందు ముందు మనకె ముప్పుగాదొ!

5. అరయ దేవతలకు నమృతంబు లభియించె
పాల కడలి చిలుక బాటవమున
నాంధ్ర జనులకబ్బె నమృతంబు పోలిక
దేవభాష నుండి తెలుగు బాస.

6. అరువు భాషలందు నంత మక్కువ యేల?
తెలుగు బాస యనిన చులుకనేల?
తల్లిపాల విలువ తనయులే మఱచిన
తల్లడిల్లి పోదె తల్లి మనసు.

7. విబుధ భాష నేర్చు విద్యాంసులకునేల
తెలుగు భాష యనిన చులుకనగునొ!
పాలకడలి యందు బ్రభవించెనెన్నియో
హెచ్చు తగ్గులందు నెంచదగునె !

8. కవుల రచన గాంచి కలహంసలలాకతో
గదిసి వెదలిపోయె గగన వీథి
భావవాహిని గాంచి భద్రేభ దానముల్
నిల్వలేక సనియె గాల్వగట్టి
శృంగార పదబంధ శిల్పచాతురి నచ్చి
రానె వచ్చె మరుడు రతిని విడిచి
నాల్గుమోములవాడు నాల్గు దిక్కులకేగె
కవుల నాల్కలనున్న కాంతకొఱకు

తే.. నవరసంబులు గల్గెడి నవ్యరచన
ప్రజల కింపును గూర్చెడి భావగరిమ
కలసి తెలుగింటి కైతయై వెలుగులీనె
తెలుగు లోగిళ్ళకందాలు తెచ్చిపెట్టె!!

నన్నయ

8. తెలుగు కవిత్వశక్తి నలుదిక్కుల వ్యాప్తము జేసి నట్టి స
త్కులజుడు భూసురోత్తముడు క్రొన్నెలతాలుపు పాదసేవకుం
దలతి పదంబులందు మధురామృత భావముకూర్చి భారతం
బిలను తెనుంగుజేసె సుకవీంద్రుడు నన్నయభట్టు మ్రొక్కెదన్.

9. నవరస భావ సంభరిత నవ్యపథంబున సాగి, పాండితీ
కువలయ శోభ నల్దిశలకున్ బ్రసరింప తెలుంగువారి గా
రవమును మేరుశైల శిఖరంబున జేర్చి చిరాయువైన యా
కవివర ధీమణిన్ గొలుతు గావ్యవిశారదు నన్నపార్యునిన్.

తిక్కన

10. చక్కని నాటకీయత రసస్ఫురణంబును జూచి మా మన
స్కక్కడికక్కడే నిలుచునష్లు మదిన్ బ్రతిమాలి యెంతయున్
మక్కువ జూపి కావ్య రసమాధురి గైకొనుచుందు మేము నో
తిక్కనసోమయాజి కవిధీర! మిముం నుతియింతుమెప్పుడున్.

కవన వైద్యము

11. కనిపించు లోకాన గడలేని భోగాలు
దిక్కు తోచనియట్టి దీనజనులు
కనిపించు లోకాన ఘనతత్వ వాదాలు
దైవదూషణ సేయు దండిమగలు
కనిపించు లోకాన ఘనమైత్రి బంధాలు
ననుమాన పీడితు లార్తజనులు
కనిపించు లోకాన గమనీయ భావాలు
పిడివాదములు పీటముడుల నుడులు

తే.. కనగ లోకంబు రసమయ కళలమయము
కనగ లోకంబు నీరస కథలచయము
ఈ పరస్పర వైరుధ్య మెటుల బోవు
కవన వైద్యమే యిక బరిష్కారమేమొ!

4. మలయ మారుతము

1. కవితా మతల్లికా కలకంఠ మృదురవం
బతులిత మలయమారుతము నాకు
సద్భక్తి సముపేత సంకీర్తనామృతం
బతులిత మలయమారుతము నాకు
దేశ సౌభాగ్య నిర్దేష్టల గుణగణం
బతులిత మలయమారుతము నాకు
జ్ఞాన ప్రదాతలౌ సద్గురు బోధనం
బతులిత మలయమారుతము నాకు

తే.. స్వార్థమెఱుగనియట్టి సజ్జనుల మైత్రి
యతులితమ్మైన మలయమారుతము నాకు
అమరజీవుల నిరుపమత్యాగగాథ
అతులితమ్మైన మలయమారుతము నాకు!!

మూలుగు

1. వేళకు తిండిలభింపక
మూలను బడి పేదవాడు మూలుగుచుండన్
వేలుగ కోట్ల ధనంబులు
మూలను బడి బ్యాంకులం దవి మూలుగు చుండెన్.

అవని

1. కుల రాజకీయాల కుమ్ములాటలు పెంచి
పోషింపబడుచుండు బుడమి మనది
ఘన దేశభక్తుల తనుధనమానాల
త్యాగాలు బట్టని ధరణి మనది
అసమానతలపైని నన్యాయముల పైని
సహనమ్ముజూపు దేశమ్ము మనది
ప్రక్కవాడిని ద్రొక్కి పైకెక్కు టొక్కటే
నేర్పుగ నేర్చిన నేల మనది

తే.. లంచ గొండుల పాలిటి కంచు కోట
అక్రమార్కుల కనువైన ఆటపట్టు
స్వార్థ పూరిత జనుల పైశాచికతకు
ఆత్మబలి జేసికొనుచున్న యవని మనది.

ప్రకృతి కాంత

1. కాలపురుషుడు తనపాలి కాంతుడనగ
ఆరు ఋతువులు ధరియించు హారములుగ
పగలు రాత్రులుచ్ఛ్వాస నిశ్వాసములుగ
ప్రకృతియను కాంత కరమొప్ప వరలుచుండు!!

2. ఉదయభానుడు చెలువారు నుదుటి బొట్టు
పసిడిపంటలు తా గట్టు పట్టుబట్ట
జలధులన్నియు మేఖలా సన్నిభములు
కొండలరయంగ సొంపారు కుచయుగమ్ము!!

ఒత్తిడి

వడివడి నిద్రలేచి భగవంతునిపై యొక నిందవేసి భ
క్తుడువలె బూజసేసి సిరికోసము గాలము వేసివేసి సా
గెడి నడకాగనీక పరుగే పనిగా బని చేసిచేసి యొ
త్తిడులకు బుఙ్జీవాచి యికదీయరె కున్కను రాత్రివేళలన్!!

స్నేహము

1. మనమక్కఱ లేనప్పుడు
మనకక్కఱయేమి స్నేహ మాధురి పంచన్
మనకున్ మనమే హితులము
మనమఙ్జాడంగనేల మైత్రిని నెఱపన్!!

2. ఏకాకిగ జన్మించుట
యేకాకిగ యిలను విడచి యేగుట నడుమన్
నీ కోరిన స్నేహంబే
కాకి పరాత్పరునితోడ గలుగుట మేలా!!

పుస్తకం

1. తమకు తగిన వారె తమకు మిత్రులనుట
విదితమయిన రీతి వింటి కంటి
నీవు చూపు చెలిమి నేనెఱుంగక యుంటి
బూర్వజన్మ సుకృత పుణ్యమనెద.

2. ఎంతటి స్నేహశీలివా గదే ! నినునేస్తముగా గొనంగ నే
నెంతటి భాగ్యశాలినొ గదే ! పలుకాడగ తోడులేని యే
కాంతపు వేళలందు నను నాప్తునివోలె సమాదరించి నీ
పొంతను సేద తీర్చితివి ! పుస్తకమా విలువైన బంధమా !

3. గుఱుతేనా యది నీకు ! భద్రగిరి పై కొల్వున్న రామాలయ
మ్మరవిందాక్షుడు రామచంద్రుడు దరిన్ సౌమిత్రియున్ సీతయున్
వరగోదావరి పిల్లతెమ్మెరలు నా వాద్యమ్ములున్ గీర్తనల్
పరమానందము నీయలేదె మనకున్ పల్కాదుమా ! పొత్తమా !

4. వెదుక పనైన లేక వెనువెన్కనె వీడక కష్టనష్టముల్
పదపడి రాగ సాయపడు వారులభింపని నిస్సహాయతన్
నిదురకుప్రమించునెడ నీవొక తీయని జోలపాటవై
మదికి సుఖంబు గూర్చెదవు మైత్రికి దావలమైన పొత్తమా!!

ఆడజన్మ

1. తోడబుట్టినవారి తోడునీడగ నిల్చి
ముందుండి నడపు దోబుట్టువగుచు
నే కల్మషము లేని యేరు తీరుగ స్నేహ
నీదాశ తీర్చెడి నేస్తమగుచు
తాళికట్టిన భర్త దైవమంచు దలంచి
సర్వదా సహధర్మచారిణి యన
నవమాసములు మోసి, నడక నడత నేర్పి
తల్లిగా సృష్టికాధారమగుచు

తే.. సహనమందున బుడమికి సాటి యగుచు
క్రొత్తలోకంబునకు దొలిగురువునగుచు
నిన్ని పాత్రలకెంతేని వన్నె నొసగు
నాడజన్మకు దక్కెబో యమృతగుణము!!

2. తొల్లిట దల్లిని విడువరు
మెల్లగ తమతల్లి వదలి మెచ్చును దండ్రిన్
వల్లభుడటుపై సర్వము
పిల్లలపై నిలుచు పిదప వెలదుల ప్రేమల్

3. అరయన్ దల్లిగ భార్యగా యనుజగా ఆత్మీయ బంధంబుగా
పరమానందము గూర్చుచుందురొకచో స్వార్థంబు లేకుండగన్
నరకమ్మున్ తమలోనె చూపునొకచో నానాప్రకారంబులన్
తరమే స్త్రీల మనఃప్రవృత్తి నెఱుగన్ త్రైకాలసంవేదికిన్.

కోకిలమ్మ

1. ఎవరి రాకకోరి ఏలాభమాశించి
యింత కాలమాగి యిపుడు వచ్చి
కొమ్మ కొమ్మ జేరి కుహుకుహూరవములన్
కూయుచుంటి విటుల కోకిలమ్మ !!

2. ఆరు ఋతువులందు నరయ వాసంతమే
బొట్టుపెట్టి పిలిచినట్లు నిన్ను
మావికొమ్మ జేరి మధురగానముతోడ
కోరి కూయుటేమి! కోకిలమ్మ!!

3. గురువులు జెప్పిన పాఠము
మటి మటి యేకాంతమందు మననము జేయున్
సరియగు శిష్యునికైవడి
స్వరసాధన జేయు పికము సతతము నొప్పున్.

4. ఇహ లోకపు భోగములవి
యహితంబని తలచి సతము హరిహర గాన
స్పృహగల్గిన యోగి పగిది
కుహుకుహు రవమాలపించు గోకిల భళిరా!!

5. నీవెవ్వరు మేమెవ్వరు
మావద్దకు వచ్చి, గానమాధురితోడన్
మా వీనుల సుధలొలుకుట
భావమ్మును దెలియనైతి బలుకుమ పికిమా!

అత్త – కోడలు

1. అత్తవారి యింట క్రొత్తకోడలిపైని
పెద్దరికపు టత్త పెత్తనంబు
క్రొత్త ప్రాతదైన కోడలు పెద్దైన
యోద బండికరణి నొప్పుచుండు!!

2. ఆడుదానికి శత్రువు నాడుదనుట
కత్త కోడండ్రె మనకు ప్రత్యక్ష సాక్షు
లౌకరొ యిద్దరొ చెలిమిగా నుండవచ్చు
గాని తెలియంగ నదియు లెక్కకును రాదు!!

కలహాలు

1. కలహంబులందమే కాపురంబులలోన
నిజమెంతొ నేటికి నేనెఱుంగ
యీమాట నెవడొ ప్రక్కింటి పుల్లయ పల్కి
యుండంగవచ్చు హాస్యోక్తితోడ
వానిమాటకును తందాన తానా యంచు
తడవకున్ దడవకున్ దగవులాట
యే పురాణంబుల నెందేని దంపతుల్
గొడవలకును సుఖపడుట కలదె

తే.. యొకరి బలహీనతలను వేరొండు హెచ్చి
రెచ్చగొట్టుచు బరువును రచ్చకీడ్చు
కలహమందంబె? చూడగ గాపురమున
నిజము నిజమెంతొ నేటికి నేనెఱుంగ!!

హితోక్తి

1. లోకులు తోడివారి గుణలోపములన్ గడునిచ్చగింపుతో
నూకొని యాలకించి, వడి నొప్పరికింపక యెల్లవారికిన్
గాకుల రీతి బల్క సమకట్టుదురోయి మనస్స! కావునన్
లోకపు తీరు తెన్నెరిగి, లోప విదూరత సాగుచుండుమా!!

2. రామ పదారవిందముల రాగము జూపవె మానసంబ! దు
ష్కామ మదాది శత్రువుల కట్టడి జేసెడి శక్తి గల్గు ని
ష్కామల రూపుడైన పరమాత్మను గాంచెడి బుద్ధిగొమ్ము మా
యామయమైన లోకము సుమా ! యిదినాదను చింతమానుమా!!

3. విడువుమ దుర్గుణంబులను వీడుము నిత్యమనిత్య భోగముల్
గడపుము కాలమెల్ల గనుగానని తప్పులు చేయకుండగా
నెడద నసూయ కాశలకు నింద్రియచాపల దుష్టరక్తికిన్
విడిదిగ జేయబోకుము వివేకము ముఖ్యము మానవాళికిన్!!

4. కలిగిన యౌవనంబున వికారవిదూరత సంచరింపుమీ
యలుగక బంధుకోటియెడ నర్మిలినాదర వృత్తి సాగుమీ
కలిమికి లేమికిన్ మిగుల గాసిలి బోవక తృప్తినుండిమీ
కలిగిన మూడురోజులు సుఖంబున కాలము నీద్చుచుండుమీ.

5. జగమున వాగ్వాదమ్ములు
జగడమ్ములకారణములు సత్యముసుమ్మీ !
తగవులనెన్నడు గోరకు
తగుదునా యమ్మా యటంచు దరికిన్ జనుచున్!!

6. మనసా ! యనూన సహనము
మనుజునకును బెద్దతొడవు ! మఱవకుమదియే
యొనగూర్చును సకలమ్మును
మును ధర్మతనూజ కీర్తిమూలము క్షమయే!!

7. ఒకరి యిష్టానిష్ట మొండొరుపై రుద్దు
టేపాటి న్యాయమో యెఱుగవలయు
ఉన్న నాలుగునాళ్ల నూసురోయని గాక
యుత్సాహమున సాగుచుండవలయు
ఆత్మాభిమానిత కవరోధమగునట్టు
లనరానియట్లు పల్కాడవలదు
పోరునష్టంబగున్ బొందు లాభంబన్న
మాటనెన్నడు మది మఱవరాదు

తే.. వృధగ కాలంబు నెన్నడు విడువరాదు
వ్యసనభూతాల బారిన బడగరాదు
కష్టమో నష్టమో బ్రతుకవలె గాని
ఏడుచుచు నేడుచుచు బ్రతు కీడ్వరాదు!!

8. సుజనుల ప్రాపునుజేరుము
కుజనులతో మైత్రినెపుడు కోరకుసుమ్మీ
విజయమొ వీరస్వర్గమొ
నిజధర్మా చరణమందె నిలుపుము బుద్ధిన్.

9. అడుగక మేలొన గూర్చెడి
కడిగిన ముత్యంపు మనసు కలిగిన వారిన్
వడిగొని వచ్చిన రీతిని
దుడుకుగ పల్కంగరాదు దోషము సుమ్మీ

10. పలుకకు కఠినపు పలుకులు
ములుకులగుచు తిరిగి నీకె ముప్పును తెచ్చున్
కలచకు సుజనుల మనసును
కలనైనను వారితోడ కలహింపకుమీ!!

11. సార హీన మైన చదువును చదువుచు
మోహవార్ధియందు మునకలిడుచు
నెంతకాల మిటుల నింద్రియాధీనతన్
పరుగులిడిన దుదకు ఫలితమున్నె!!

12. ఎవరికి వారై బ్రతుకుచు
నవసరములు కలిగినంత నాప్యాయముతో
నవనీత మధు రసోక్తుల
నవధులనే దాటి మనుజు డనృతములాడున్

కోడిబాధ

1. నిదుర పోయెడి వారిని నిద్ర లేపు
టెంత పాపంబొ నేడు గ్రహించినాను
ఫలితముగ నేడు కోడి రూపంబులోన
జనన మందగ వలసెనీ జనుల మధ్య.

2. నిదుర పోయెడి గాడిద న్నిదుర లేపి
తిరిగి తన్నించు కొను వాని తీరువోలె
మేము సైతము జనులను మేలుకొలిపి
కోటి కష్టాలు కొని తెచ్చుకొందుమిలను.

3. ఎండ వాన లందు నిబ్బంది లేకుండ
వాస యోగ్యమైన వసతి గూర్చి
ప్రక్క దేశములకు వ్యాపారమనుపేర
పంపు చుంద్రు మమ్ము చంపుచుంద్రు.

4. మూఢ వర్తనముల ముసుగు పై ధరియించి
మూగ జీవి యుసురు పోసికొనుచు
మానవత్వ మెపుడొ మసకబారెను గదా!
నీతి మాలి! సానుభూతి వీడి!

గెలుపు

1. వన్నెలు తగ్గుచున్నవని బాధను జాబిలి దాగిపోయినన్
పున్నమ దెట్లు వచ్చు నిక మోడయిపోయితినంచు పాదపం
బెన్నగ మీదటన్ జిగురు లేర్పడుటెట్లు, వివేకహీనుడై
నిన్నటి మొన్నటోటముల నెట్టకయుండిన గెల్వనెట్లగున్.!

2. అరకొర విద్యనేర్చి జయమందుట కల్ల విశాల భూస్థలిన్
గఱవను మాటలేదుగద! కష్టము నమ్మినవారికెందు, సో
మరులకు నేటి సౌఖ్యములు మారుట తథ్యము భావియంతయున్
నరకమె యీ నిజమ్మెఱుగునాటికి శూన్యమె కాలమంతయున్!!

3. వెఱపునుమాని నిష్ఠగొని వేగము నందలసత్వ ధోరణిన్
దరిచననీక యడ్డమగు దారుల వెంబడి పోక వాంఛలన్
దరుమగనీక వాణిపద దాస్యము వీడక ముందుచూపుతో
నిరతము సాగగా వలయు నిక్కముగా విజయమ్ము గోరినన్!!

4. సుందర తరుణీ స్తనయుగ
మందిర వాసంబుకన్న మనుజులకిలలో
పొందిన విజయపు లేశం
బందించదె యవధిలేని యానందంబున్.

5. జలముల శీతస్పర్శయు
నిలకును గంధమ్ము గుణములెసగినయట్లే
తెలియగ నా చిత్తమునకు
నిలచినదో విజయ కాంక్ష నిత్య గుణమ్మై

6. గెలుపది చేతో మోదము
గెలుపత్యంత సుఖకరము, గెలువగ మధురో
హల పల్లకిలో నీవు, జ
నులు బోయీల వలె నీ యనుజ్ఞకు బద్ధుల్.

7. గడచిన కాలంబందున
పొడమని సంతృప్తి నృపులు పుడమిని గెలువన్
దడయక పోరాటమునకు
వెడలగ గల కారణంబు విజయేచ్ఛయగా.

లక్ష్యం

1. అయువ దొక్కటున్న నిల నాగక సాగెద లక్ష్యసిద్ధికై
ప్రాయము చేయి జారకయె, వాడిగ పట్టిన పట్టునెవ్విధిన్
బాయక ముందునాళ్ళ పొరబాటులు నేర్పిన పాఠముల్ మదిన్
రోయక కన్నవారి కనురోదన కెన్నడు తావొసంగకన్!!

2. నీవు నిల్చిన భూమి నిమిష మాత్రంబైన
నాగునే యాయాసమందెనంచు?
కొండ కోనల సాగు కొండవాగుల తతుల్
కదలి జేరకయున్నె బదలికంచు
మాదు పూవుల ఫండ్లు మాకె సొంతంబంచు
తలచునే వృక్షముల్ ధరణి యందు
కొమ్మ కొమ్మలపాడు కోకిలమ్మెపుడైన
కాన్కనాశించునే గానమందు

తే.. అరయ నలసత్వమున్నదే ధరకు నదికి
పాదపంబున్ను బికమునే స్వార్థమెఱుగు
స్వార్థ భావజాలమునకు స్వస్తి పలికి
నలుగురకు మేలు సేయుచు నడచుటొప్పు!!

ఆకాంక్ష

1. ఆర్యోక్త నియమమ్ము లాచరించుచు జన
మ్మారోగ్య భాగ్యంబు నందుగాత
శాస్త్ర వాక్యంబుల సంగతి పాటించి
నీతితో లోకంబు నిలుచుగాత
సుఖవాంఛ ధనవాంఛ సోలిపోవక మంచి
జ్ఞాన మార్గంబులో సాగుగాత
కులమతమ్ముల పేర కుమ్ములాటలు లేక
ఐకమత్యంబుతో నలరుగాత

తే.. మానవతతోడ జనకోటి మసలుగాత
స్వార్థ భావంబు జగమున సమయుగాత
పసిడి వన్నెల పంటలు పండుగాత
దేశ సౌభాగ్యమెల్ల వర్ధిల్లుగాత !!

2. పడతులుండవలయు భర్తృ వ్రతము తోడ
జాతి నిలువవలయు నీతితోడ
యువలు జడత విడిచి యుత్సాహవంతులై
దేశమాత ఋణము తీర్పవలయు.

సలహా

1. జూదమాపుమనిన ధర్మజుండు వినెనె
గీత దాటంగరాదన్న సీత వినెనె
తమకు తోచిన యదియె మతంబుగాని
అరయ జనము పరుల సలహాలు వినునె.

2. పరుల సతుల చెఱుప ప్రాణాంత కంబని
చెవిని నిల్లుకట్టి చెప్పుచున్న
రాక్షసాళి విభుడు రావణుండు వినెనె
అరయ పరులకు సలహాలు విషమె.

బంధుత్వాలు

1. మంచి చూడరు దోషంబు మఱచిపోరు
సాయమీరాయె మనమీయ జ్ఞప్తి గొనరు
అంటి యంటక యుండుట యన్నియెడల
మంచి దనిపించుచుండు నా మనసు కెపుడు!!

2. పొట్ట పట్టెడుదాక పట్టు వీడనిరీతి
రక్తంబు పీల్చు జలగ విధంబు
బక్క చిక్కిన జీవి పైబడి పైబడి
ప్రాణంబు తీయు రాబందు పగిది
నౌరసత్వంబుగా ప్రాప్తించి విడువక
కడతేర్చు దీర్ఘ రోగంబు మాడ్కి
పాలు ద్రావుచు కాటుపాల్సేసి పెంచిన
వారినే చంపు సర్పంబు వోలె

తే.. కష్టసమయమందు గనుమేర గనరాడు
భాగ్యమందున సగపాలు కోరు
బంధమనెడి మాట బంధనముగ మారె
బంధు జనుల జూడ భయము పుట్టె!!

బాల్యము

1. ఆటపాటలందు నలసిపోదగు బాల్య
మేలనిటుల బరువులెత్తుచుండె
ఏమి తప్పు చేసిరీ చిన్నిబాలలు
బాలకార్మికులుగ బ్రతుకవలసె!!

2. చెత్త కుప్ప ప్రక్క చిరిగిన బట్టతో
వీధి కుక్క తనను వెక్కిరింప
పాత కాగితములు ప్లాస్టిక్కుడబ్బాల
నేరు కొనుటకెవరు కారణమ్మొ ?

కాలము

1. కాలమ ! యిప్పుడైన మమకారము జూపుమ! శత్రువట్లు న
న్నేలతలంతువో! పలుకవేటికి నాకు జవాబు నిమ్ము పు
ణ్యాల తతుల్ ఫలించిగద నాకిటులబ్బె మనుష్యజన్మ యా
కాలుని చెంత జేరుటకు గాదుగ పుట్టుట వృద్ధి చెందుటల్ !!

2. పుట్టినదాదిగా ననుగు బుత్రునిగా బితరుల్ దలంత్రు, జే
బట్టినదాది కాంతయును భారము నీపయి వైచి గొల్చు, నీ
జట్టునుగట్టి చుట్టుకొను సారెకు మిత్రజనమ్ము నయ్యు దా
నెట్టుల జాలి చూపగలదెంతగ వేడినకాల మాగునే.

మనసా

1. ధనమది పరమావధిగా
గనిపింతురు లోకులెల్ల కాలములందున్
మనసా నీవది నేర్వకు
విని మెచ్చరు సజ్జనాళి పృథివీ స్థలిలోన్!!

2. జననంబాదిగ జూచుచుంటి మనసా! సైరించి సైరించి యిం
కను నిన్ సైరణ సేయజాల నొకచో గల్యాణ వారాశివై
జని సార్థక్యమొనర్ప బోదువొకచో సమ్మోహ పాథోధి నన్
మునుగన్ వైచెదు తేల్చివైచెదకటా! మోసంబులింకేటికిన్!!

3. వారిజ సంభవు జనకుని
సారస నయనుని మునీంద్రచయ నిజగమ్మున్
నారాయణు నామాక్షర
పారాయణ మధుర రస పిపాసువు కమ్మా!!

సెల్ ఫోన్

1. వేళకాహారంబు పెద్దమేటరు కాదు
కంటికి నిద్ర ముఖ్యంబు కాదు
చేతిలో సెల్‌ఫోను చెవిలో యియరుఫోను
చార్జింగు సిగ్నలు చాలు దనకు
అమ్మ! యెట్లుండెనే యారోగ్యమనక యా-
ఫర్లకోసమ్మె ఎంక్వైరి చేయు
బైకుపై రోడ్డుపై బస్సులో పార్కులో
చెప్పంగ సర్వమ్ము సెల్లుమయము

ఆ.. సెల్లు చార్జి తగ్గి, స్విచ్చాఫె అయ్యెనా
లేనిపోని చెప్పరాని బాధ
కర్మకాలి సెల్లు కనబడకున్నదా
లోకమెల్ల జిమ్మ చీకటింక!!

2. మాటలాడు వాడు మగవాడొ ఆడదో
ప్రక్క వానికెఱుక పడదు సుమ్ము
చివర 'రా' ను చేర్చి చేయు సంభాషణల్
తెలియ గలడె బ్రహ్మదేవుడైన.

అసూయ

1. బంధుజనులు గారె పాండవుల్ కౌరవుల్
వారి మధ్యనున్న వైరమేమి
పాండు సుతులపైని బగయేల జనియించె
చూడ గారణంబసూయ గాదె!!

2. కోరి కైకేయి కోరిన కోర్కులరయ
నందు దాగినయట్టి రహస్యమేమి
కనగ కద్రువ వినతల కలహమందు
జోద్యమేమున్నదొక్క యసూయ తక్క!!

వేదాంతం

1. తోలు తిత్తిని దెచ్చి తోలు బొమ్మను జేసి
ప్రాణ వాయువులను ద్రాదు జేసి
భ్రాంతి రూపంబగు రంగస్థలంబులో
జిత్రంబుగా దాని బాత్రజేసి
బంధువుల్ బంధముల్ పరిపంథివర్గమున్
కష్టమున్ సుఖమునున్ గలుగజేసి
యాట తమిని దాని నటుద్రిప్పి యిటుద్రిప్పి
విసిగినంతనె దాని విసిరివేసి

ఆ.. లీల జూపుచుండు కేళీ విలాసుడై
మోహవార్ధి మనల ముంచివైచి
ఆటలాడుచుండు నా పరంధాముండు
పూని మనల నాటబొమ్మ జేసి!

2. తల్లి దండ్రులంచు దల్లడిల్లగ నేల
బంధుమిత్రులంచు వగవ నేల
ఆలుబిడ్డలంచు నాయాస పడనేల
విబుధులనరె యిదియ విష్ణుమాయ!!

3. మాటుగ మాతృ గర్భమున మాయ లెరుంగని లోకమందు నా
పాటికి నేనునొంటరిగ పాలునొ గంజినొ త్రాగుచుండగా
నా టయిమ్మైన దంచు మరి నన్నిటు పంపిన యాతదెవ్వడో
మాటకు నైన నొక్కపరి మర్మము తెల్పడదేమి చోద్యమో.

విజ్ఞుడు

1. సతతము తల్లిదండ్రి కనుసన్నల నుండెడివాడు బిడ్డ, తా
నితరుల గొల్వకుండ ప్రజకింపును కూర్చెడివాడు రాజు, కా
మితమగు లక్ష్యసాధనకు మేన్సుఖముల్ త్యజియించువాడు జే
త ! తనువశాశ్వతంబనుచు దా హరి గొల్చినవాడె విజ్ఞుడౌ!!

చింత

1. చింత యొకింత వింత, పెనుచిక్కులు దెచ్చెడిదంట యీజగం
బంతయు మిధ్య బంధుజనులందరు స్వార్థమనస్కు లంతయున్
భ్రాంతి, సదావృధా, తెలిసివానిని జూపెడిప్రేమ, వానిపై
చింత యొకింత వింత, మతి చింతకు మూలము నీవె కాదొకో!!

2. ఏమియుకాదు నీకు భయమింతయు నందకు కీడురాదు, లో
టేమియు కల్గబోదు పరమేశ్వరు దచ్యుతుడెల్లవేళలన్
బాముల నిన్ను సాకెదరు, పైబడు కష్టములన్ని నాశమౌ
నీమనమందు లేశమును నిల్పకు చింతను సౌఖ్యమౌ సదా.

3. జనని ఒడిని చేరి చనుబ్రాలు త్రాగెడి
శిశువు చెంత జేరు చింత లేవి
వాడె పెరిగి పెద్ద వాడైన తరువాత
జూడ చింత తప్ప సుఖము లేవి.

మూఢభక్తి

1. మంచిని మానవత్వమును మన్నన సేయక మూఢభక్తితో
వంచన బుద్ధితో బలు నెపంబులు సూపుచు జీవహింస కా
వించుచు రక్తపాత మొనరించుచు నుండిరి హే భవాని ! నీ
పంచను మూగ జీవులకు బట్టిన దుర్గతి బాపవేలనే !

2. ముగ్గు రమ్మలకును మూలమౌ దుర్గమ్మ
సన్నిధానమందు జంతుబలులు
భక్తి ముసుగులోన రక్తపాతము జూచి
మానవత్వమెపుడొ మసక బారె.

అనుమానం

1. అనుమానపు పెనుభూతము
మనుజులనది యావహించి మగుడని బలిమిన్
తిననీదట మననీదట
దిన దినము కృశింపజేసి దీనునిజేయున్.

2. ఒక యమ్మ నాల్కదిగదిం
కొక యమ్మయు గుండె విడిచి యుండదు భళిరా!
ఒక యమ్మ సగము వదలదె
అకటా ! అనుమాన మొక్క అతివల సొత్తా!

3. ఒక మూర్తి మోహచకితుం
డొక మూరితి సవతి జేర్చె నుల్లము నందున్
ఒక మూర్తి తలను దాలిచె
నకటా ! కులసతుల బాధ కాద్యులుమగలే !

4. అలి మనసునందు ననుమాన మేర్పడన్
బరగుటెంతయేని భావ్యమగునె
దాపరికములేల తప్పు జేయనినాడు
తేటతెల్ల మనగ తెలుపవలదె !

5. నిప్పును బలె ననుమానం
బొప్పరికింపంగ బోవకున్కిని గాల్చున్
సప్పమువలె పాఱ్ఱాడ్రావుచు
ముప్పును గలిగించునట్టి పోలికనుండున్!!

ప్రేయసి

1. హే సఖి ! నిన్ను పద్యమని యెంచెదు ! నీ తలిదండ్రులే యతి
ప్రాసలటంచు నెంచెద నలంకరణంబులు వంపు సొంపుగా
భాసిలునంచు నెంచెదను బాదగణమ్ములు నూపురంబులై
మ్రోసెనటంచు నేను దలపోసి, రసమ్ముగ నన్ను నెంచెదన్.

2. కలకంఠిన్ గనుగొంటి, యామె నుడులన్ కాదంబరిన్ గాంచితిన్
కలహంసన్ గనుగొంటినామె నడకన్, కాదంబినిన్ వాల్జడన్
దలిరాకున్ గనుగొంటినా కయిగవన్, వాసంతమున్ నవ్వులోన్
గలనైనన్ మఱువంగ రాని సిరిగా గన్గొంటి నా ప్రేయసిన్.

3. అరుణోదయమందు దిమిర
హర కరములు తాకు శారదాభ్రం బనగా
సురుచిరమగు గెమ్మోవిని
చిఱు నవ్వుదయించినపుడు చెలి ముఖమొప్పున్.

4. చెలి ! నీపై వలపేదొ పుట్టి ! మది నిన్ జేరన్ బ్రయత్నింపగా
బలు మార్పుల్ పొడజూపె నీవ్యవధిలో పల్మారులీసృష్టిలో
తెలుపన్నేరక యుంటి నీ తలపులో తియ్యందనం బేమిటో !
కలవాణీ ! అళినీలవేణి ! తళుకుంగాణాచి ! నా ప్రేయసీ !

5. పరిపరి విధముల నినుగని
అరవిరిసిన సుమనికరము లలిగెను మదిలో
సరసుల మనసుల రతిపతి
విరిశరములు విడువ మిగులవిరహములొదవెన్!!

6. అలసిన యీనా హృదయము
చెలి! నీ కౌగిటను జేరి సేదను దీరున్
తెలియగ నాయీ ప్రాణము
నిలుచునె యొక గడియయేని నీవిరహమునన్

7. విరిసిన సుమముల దరిచని
మఱిమఱి మధువులను గొనెడి మధుపములవలెన్
సరియగు సొగసరి యువతుల
సరసకు సుఖమధువు గొనగ జనరే సరసుల్!!

8 నిను వీడంగ నిమేష మాత్రమయినన్ నిల్వంగ లేనంటినే
నను నీరీతి యుపేక్ష జేయ దగునే నా తప్పిదంబేమిటే
నినుప్రేమించుటకెవ్విధిన్ దగనటే నీ సాటిరానేమిటే
మనసెన్నాళ్లని యోర్చు కోగలదు నీ మౌనంబు చాలింపవే!!

9. నిమిషమ్మొక్క యుగంబుగా గడపితిన్ నీలేని కాలంబునన్
నిముసమ్మొుచు యుగంబు గానబడె మున్ నీ సన్నిధానంబునన్
సమయమ్మన్నది లేని లోకమున నాసొంతంబు నీ తోడులో
అమరంబౌ ప్రణయమ్ము గైకొనగ నీ అంగీకృతిన్ తెల్పుమా !!

10. ఒక నిమిషంబు నిన్విడిచి యుండగ జాలని నన్నుపేక్షసే
యక, మధురోహ సంతతికి నాయువు పోయగ, ప్రేమదిక్కులన్
ప్రకటితమౌనటుల్, ప్రణయ బంధము శాశ్వత మౌనటుల్ చెలీ !
ఒకపరి పల్కవే మధురసోక్తుల మానస మెల్ల నిండగాన్!!

ప్రేమలేఖ

1. ఇంతకు ముందులేని సుఖమేదొ మనస్సున దోచె ! నిన్న సా
యంతనవేళ పుస్తకము హస్తగతమ్ముగ మేడపైని ఏ
కాంతముగా జరించు సమయంబున వేరొక మేడనెవ్వరో
కాంతను జూచి నేనొకటి కైతను వ్రాసితి సాహసంబుతో!!

2. నచ్చునొ! నచ్చదో! తనకునచ్చిన మెచ్చునొ! మెచ్చదో! సరే
యిచ్చిన కైతనందుకొని యింటికి తీసుకపోయి తండ్రికే
యిచ్చిన నా పరిస్థితి? సరేసరి! యట్టుల జేయకుండ నే
నిచ్చిన కైతమెచ్చి మనసిచ్చునొ! వచ్చునొ! యేమొ! యందుకే!!

3. ఎవ్విధముగనైన నీ ప్రేమలేఖను
చెలియ జేతియందు జేర్చవలెను
మార్గమేదియంచు మనసులో చింతింప
నొక్కసారి యెద కళుక్కు మనియె!!

4. తెగువ నరువుతెచ్చి ధైర్యంబు కొనితెచ్చి
గుండెనొక్కమారు కుదుటపరిచి
కొంత చొరవజేసి గొంతును సవరించి
యామె రాకకొఱకు నరసి యరసి!!

5. వర్ష జలము కొఱకు గర్షకు కైవడి
యామనికయి కోకిలమ్మ పగిది
కుముదపతిని గోరు క్రొత్తజంటను బోలె
చెలియ రాకకొఱకు నిలిచియుంటి!!

6. ఇంతసేపైన చెలిజాడ యేల లేదు
వాస్తు దోషంబొ యేమొ గావచ్చు, కాస్త
ప్రక్క నిలబడి చూచెద ఫలిత మేది
యైన నుండగవచ్చుని యాసపడితి.

7. ఘడియ ఘడియకు గుండె వేగంబు పెరిగె
సవ్వ డేదైన లోనలజడులు కలిగె
పరవశంబయి హృదయంబు పరుగులెత్తె
కనులు రెండును గాయలు కాయదొడగె.

8. పడిన యాసది చీకటిపాలె యయ్యె
చుక్క లన్నియు ననుజూచి వెక్కిరించె
ముందు జరిగిన విషయంబు పూసగ్రుచ్చి
పలుక దొడగెను రోహిణి పతిని గనుచు.

9. విరహ బాధకు సైతము విసుగుపుట్టె
నన్ను జూచు వారికనుమానంబు పుట్టె
నా పరిస్థితి గని నాకె నవ్వుపుట్టె
తమకు దామె పాదము లింటిదారి పట్టె.

10. ధైర్యమూని పిదప దరిజేరి కోరితి
నవును గాదునాక యలిగి వెడలె
కొంత కాలమాగి కోరితి మరుసారి
తగదటంచు నామె మగని జూ-పె!!

ప్రేమ పాట్లు (మాలినీ వృత్తము)

1. దినము దినము నీకై దిక్కులన్నింటియందున్
బనులు విడిచి చూడన్ బ్రాణముల్ దస్సిపోయెన్ కునుకు
పడదు రేయిన్ గూర్మితో నిమ్ము చేయిన్
మనసు విరహ బాధన్ మందుచుండెన్ ప్రియాంగీ!!

2. చదువు చదువు వేళన్ శ్రద్ధ యొక్కింత లేమిన్
గుదురు చెదరి లోలో గోరికల్ పుట్ట జొచ్చెన్
వెదకి విసిగిపోతిన్ ప్రేమకెన్నెన్ని పాటుల్
నుదువ నలవి కాదీ నొప్పి వర్ణింప నాకున్!!

చిత్త వృత్తి

1. మనసును నిగ్రహించుటది మాటలు కాదనిపెద్దలెందరో
పనిగొని చెప్పగన్ సుగుణ వైరి మదీయ మనస్సునాప జూ
చిన ఫలశూన్యమై తనరె, జీవనయాన సుదీర్ఘయాత్రలో
మనసును నిగ్రహింపగల మాన్యునకేగద శాంతిసౌఖ్యముల్.

2. రామ రామ యనుచు నామజపము జేయ
చిత్త మెన్నడేని సిద్ధపడదు
పనికి రాని విషయవాంఛలన్ దగులుచు
గాలమంత వృథగ గడుపుచుండు.

సాకులు

1. సాకు లేవొ చూపి సజ్జనుల్ సైతంబు
వ్యసన సంఘములను వదలరైరి
చదువు గల్గు వారు చదువనివారలు
నొక్క రీతి నొప్పుచుంట వింత

2. సంఘమందు తగిన సత్కీర్తి బడసియు
చిత్త వృత్తి నదుపు చేయలేక
వ్యసనరాజియందు పొరాడు చుండిరి
ప్రాజ్ఞులైన వారు నజ్ఞులట్లు!!

3. ఆలి యింటను దొడ్డ గయ్యాలి యంచు
నత్తకోడంద్ర సఖ్యము రిత్త యనుచు
సాకులేవేవొ చూపి, సంసారి యిలను
వ్యసన పాశములకు నిత్య బద్ధుడగును!!

లోకంతీరు

1. హృదయము లేని లోకముసుమీ! యని జాషువ పద్దబాధ నా
యెదను స్పృశించి నాకు బదులిమ్మనికోరె ! జవాబుకోసమై
వెదుకుచునున్న నాకు కనువిప్పగు రీతిని స్పష్టమయ్యె సం
పద పరమార్థమై జనము స్వార్థ పరాయణమై కనంబడెన్.

2. నడచుట రాక నేలపడునాడు, మహీజనులాదరమ్ముతో
నడుగకె నూతమిచ్చెనని యాత్రముతో విహరింపకే మదీ!
విడువని సాధనమ్ము నిను వేగమ లక్ష్యము జేర్పకున్నచో
బడిపడి నవ్విపోవుదురు వారలె నిన్గని మాటిమాటికిన్

3. వేగమునందకున్న దగు వేదననందెడి సంకటస్థితిన్
సాగెడి వేళ నేక్షణము జాప్యము జేసిన నీరసించి నీ
వాగిన తక్షణంబు పలుకాడరు చేరరు జాలినొందరే
రాగము జూపరీ జనులు రాలను రువ్వుదురుత్సహించుచున్!!

స్వార్థపిశాచి

1. ఎందరో మహనీయు లెంతగా శ్రమియించి
పాశ్చాత్యులందరిన్ బారద్రోలి
దాస్య శృంఖలములు తప్పించి జాతికి
స్వేచ్ఛా స్వతంత్రముల్ చేతికిచ్చి
రాచరికము మాన్పి రాజ్యాంగమును దెచ్చి
భరతజాతికి మించు భవిత జూపి
యైకమత్యమొకటె యాశించి మననుండి
త్యాగనిరతి జూపి ధన్యులైరి

ఆ.. వారి యౌరసముగ వాసికెక్కిన జాతి
మఱల బానిసయగ మారుచుండె
ప్రక్కవాని గోడు పట్టించుకోదాయె
స్వార్థమనెడి పెనుపిశాచి పట్టి.

2. వేదభూమి యన్న విజ్ఞాన ఖనియన్న
కర్మభూమి యన్న ఖ్యాతినెఱిగి
భరతజాతి నేడు స్వార్థంబు విడకున్న
స్వార్థభూమి యనదె భావితరము.

సమాజం

1. మారనె మారదా మన సమాజము ప్రేమల మత్తులో ననా
చారపు ధోరణుల్ పెరిగి జాతి సమస్తము సిగ్గుచెందగా
సారెకు సారెకున్ కడు నసభ్యకరంబుగ యాదువారిపై
దారుణమైన రీతి వికృతంబులు చేయుట కళ్ళముందటన్.

2. మార్పును కోరదా మన సమాజము దేశహితంబు గోరి ప్రా
ణార్పణ జేసినట్టి మహితాత్ములు మాన్యులు శాంత్యహింసలన్
నేర్పి చనన్ గృతజ్ఞతకు నీరిడి, మంచిని గాలినుంచి యా
నేర్పిన పాఠముల్ మరచె నేటితరంబు ద్విపాదజంతువై.

3. అర్థములేని కేవల ధనార్జన మొక్కటె జీవనంబుగా
వ్యర్థ పరాన్నజీవులన నార్తుల పేదల సొమ్ము మ్రింగుచున్
వర్థిలుచుండె లోకమున బాలకవర్గము నిచ్చలున్ భువిన్
స్వార్థ పిశాచి పట్టుకొన సభ్యసమాజము సిగ్గుచెందగాన్.

4. మారనె మారదా మన సమాజము యాంత్రిక జీవనంబుతో
దీరికపాటు లేక గణుతింపగ నొక్కదినంబుగూడ నిం
పారగ నింటిపట్టున సుఖాసనుడై తనవారి సంగతుల్
కోరివినంగ లేడొరుల గోడునుగూర్చి వచింపనేటికిన్!!

5.. మనుజ జన్మనెత్తి మానవత్వముతోడ
మసలుకొనగ మనకు మనసురాదు
గాయపడ్డ వాని కన్నీరు తుడువగా
చెంతనున్న వాని చేయి రాదు.

6. అరెరే ! మనుజులు స్వార్థపు
టిరుసులతో బ్రతకుబండి నీడ్చుట సరియే!
తరతరములు పరికించిన
పరహితమును గోరునట్టి వారలు గలరే!

7. కనుల ముందు తప్పు కన్పట్టుచుండినన్
దాని నాప నెవడు పూనుకొనడు
తప్పు నాపలేని దైన్యంబదేదియో
భరత జాతి నిపుడు పట్టు కొనియె.

8. వావి వరుస లేక పాపభీతియు లేక
చేయరాని పనులు చేయువారి
కాలు చేయి తీయు కాలంబు రావలెన్
మీద జనులు హద్దు మీఱకుండ.

9. పరుల కష్ట ములను బట్టించుకొనకుండ
స్వార్థ బుద్ధితోడ సాగువాడ!
మనుజ జన్మకున్న మర్యాద మన్నించి
భువిని మరల నీవు పుట్ట వద్దు.

10. అదిగో పులియన, వేఱొం
డదిగదిగో తోక గంటి ననియెడు రీతిన్
విదితము లోకుల తీరులు
పదపడి విడువంగలేరు పామర వృత్తుల్

మునక

1. ప్రేమాభిమానమ్మపేక్షించుటది నేడు
శరదభ్ర జలముల సరణినొప్పె
మంచి జేయగబోవ వంచనల్పొడజూప
కలికాల ధర్మంపు కరణినొప్పె
కదలికంతమువోలె కనుల లక్ష్యము తోప
పోటీప్రపంచంపు పోల్కియొప్పె
పాపభీతి నశించి ప్రాణహింస చెలంగ
మృత్యురూప కరాళ నృత్యమొప్పె

తే.. నాటినాటికి జనులు మనస్సు లేని
రాయి రప్పల తీరుగ బ్రతుకు చుండ
స్వార్థ పరులుగ సంసార సాగరమున
మునిగి తేలుచు జని వృథ పుచ్చుటొప్పె.

2. తానొక్కటాశింపదైవేచ్ఛ వేఱాయె
కలికాల ధర్మమో కర్మఫలమొ
వేవేల పుట్టుకల్ వేదనల్ బంధముల్
హరిమాయొయో కాక హరు తలంపొ
విబుధ వర్జితమైన విషయవాంఛల వీడి
జ్ఞానమార్గంబులో సాగుటెపుడొ
మంచి జేయగబోవ వంచనే యెదురాయె
విధివ్రాత యందునో వెట్టి తనమొ

తే.. మనము చెప్పిన మాటను మనసు వినదు
నదియు శత్రువో మిత్రమో విదితమగునె
మనసు నదుపు సేయుట మన మతముగాదు
కనగ బలహీనతయొ! చేతగాని తనమొ!!

తోడు

1. ఒకరి కొకరు తోడై యూహ యుయ్యాలయూగన్
గగన కుసుమముల్ నీ కంఠహారంబులయ్యెన్
మినుకుమినుకు తారల్ మీదటన్ సేసలౌటన్
శశిముఖి! నిను జూడన్ చంద్రుదాశ్చర్యపోయెన్!!

అహం బ్రహ్మాస్మి

1. సకల గుణనిధానం సర్వలోకాభిరామమ్
సుజన హృదయవాసం జానకీ ప్రాణనాథమ్
బలవదరి శరణ్యం సచ్చిదానంద రూపమ్
స్మరతి మమ మనస్తం రామనామ్నా ప్రసిద్ధమ్!!

2. మాయా కల్పిత సంసారః
మోహాదేవ ప్రవర్ధతే
అహం బ్రహ్మేతి భావేన
మోహెూ నష్టో భవిష్యతి!!

3. సాధు సజ్జన సంసర్గాత్
సత్యాసత్య విచారణాత్
బ్రహ్మైవాస్మీతి విజ్ఞానాత్
మోహెూ నష్టో భవిష్యతి!!

నీరాజనము

1. నిరతము రామచంద్ర పద నీరజముల్ కదు భక్తితోడ సం
స్మరణము సేయువాని, భవసాగర భీకర వీచికాతతుల్
దరికొన జాలవెన్నటికి, దైవ నిధానమె దిక్కుదక్క వే
మఱు కుసుమాస్త్ర సంజనిత మాయలు కట్టడి సేయసాధ్యమే.

2. నామది నెల్ల వేళల సనాతనులైన యుమామహేశులన్
తామరచూలి నప్పలుకు తల్లిని లక్ష్మిని శ్రీనివాసునిన్
మామక జన్మకారకుల మద్గురువర్యుల సత్కవీంద్రులన్
పామర చిత్తవృత్తులను బాపగ గొల్చెద భక్తితోడుతన్!!

3. మౌనము నందు నిద్రయెడ, మంతన మాడెడువేళ, నన్నమున్
పానము నందువేళ, జము పాశము పైబడు వేళ, నింద్రియా
ధీనత నొంది యాపిదప తేకువ గల్గిన వేళ నెయ్యెడన్
మానసమందునన్ నిలిచి మాధవుడిచ్చుత మంగళమ్ములన్!!

ఇది కౌండిన్య సగోత్రుండును, కడిమిళ్ళ వంశ సంజాతుండును, భారతీ వేంకట రామయ్యశాస్త్రి దంపతుల పౌత్రుండును, మీనాక్షీ వరప్రసాద గురుసహస్రావధాని దంపతుల పుత్రుండునునగు వేంకట సత్య రమేశ ప్రణీతంబయిన

మలయ మారుతము

పద్యాకృతి సంపూర్ణము.

మంగళం మహత్

పద్య కుటుంబం



తల్లి మీనాక్షిలోని వాత్సల్య గుణము
తండ్రి కడిమిళ్ళ యొసగు విద్యాధనమ్ము
తమ్ముడు విరించి ప్రేమయు దక్కియుండ
నాకు లోటన్న దేమిటి లోకమందు.



కడిమిళ్ల రమేష్

తల్లి

మీనాక్షి - పద్యకవయిత్రి

తండ్రి

గురుసహస్రావధాని

డా॥ వరప్రసాద్

తమ్ముడు

శ్రీ విరించి - పద్యకవి

విద్య

ఎమ్.సి.ఎ.

Creative NSP 9866115113